ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 2 మార్చి 2024

ఢిల్లీ వెళ్లేదెవరు?



నరసాపురం, ఏలూరు లోక్‌సభ స్థానాలకు వైసీపీ బీసీ మంత్రం పఠిస్తోంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీల్లో ఇప్పుడు పొత్తే అభ్యర్థుల ఎంపికలో ప్రధాన ఆటంకంగా మారింది. ఈ రెండు ఎంపీ స్థానాల్లో ఏ పార్టీకి ఏది కేటాయిస్తారో తెలియక తికమక నెలకొంది. ఇప్పుడు అందరి దృష్టి ఢిల్లీ వెళ్లేవారు ఎవరూ అనే ప్రశ్న చుట్టూనే తిరుగుతోంది.

- బీజేపీ పొత్తుపై ఎడతెగని ఉత్కంఠ
- కిందిస్థాయి కేడర్‌లోనూ ఈ తరహాలోనే రచ్చ
- బీసీ అస్త్రాలతో వైసీపీ సిద్ధం
- ఇక తేలాల్సింది టీడీపీ, జనసేన కూటమే
- ఏలూరు నుంచి కంభంపాటి ప్రస్తావన
- నరసాపురం నుంచి రఘురామరాజే కీలకం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఆది నుంచి ఏలూరు పార్లమెంటు స్థానానికి ఓ ప్రత్యేకత ఉంది. రాజకీయంగా రాటు తేలిన వారే ఈ స్థానం నుంచి ఢిల్లీకి ఎదిగారు. రాజకీయాల్లో శాసించే గుణం వున్న వారే ఈ స్థానంలో పరస్పరం తలపడ్డారు. వివిధ సామాజిక వర్గాలు పార్లమెంటు సభ్యుడిని ఎంచుకోవడంలో ప్రతిసారి విలక్షణ పాటించారు. ప్రత్యేకించి ఒక సామాజిక వర్గానికి చెందినవారే గడిచిన రెండు దశాబ్దాలుగా ఈ స్థానం నుంచి పోటీకి దిగడమే కాకుండా విజయాలను అందుకున్నారు. ఏలూరు లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలన్నీ సామాజిక, ఆర్థికంగా సమిళితమైనది. డెల్టా, ఏజెన్సీ, మెట్ట ప్రాంతాలతో మమేకమై ఉంది. దీనికి తగ్గట్టుగానే ఆయా ప్రధానపక్షాల అభ్యర్థుల ముందు మిగతా ఇండిపెండెంట్లు ఎప్పటికీ బలదూరే. వాస్తవానికి ఈ స్థానం నుంచి టీడీపీ పక్షాన మాగంటి బాబు, కాంగ్రెస్ పక్షాన కావూరు సాంబశివరావు సుదీర్ఘకాలం పరస్పరం తలపడ్డారు. దేనికీ వెనుకాడకుండా రాజకీయాలు నెరిపారు. రాజకీయ, కుటుంబ ప్రతిష్ఠ వున్న మాగంటిబాబు ఈసారి ఈ స్థానం పోటీ చేసేందుకు ఆసక్తితో వున్నారు. దీనికి తగ్గట్టుగానే ఆయన అనుకూలురంతా మాగంటికి మరో ఛాన్సు ఇవ్వాలంటూ టీడీపీ అధిష్ఠానానికి విన్నవిస్తున్నారు. కుటుంబపరంగా ఈ మధ్య ఒడిదుడుకులకు లోనైన తిరిగి కోలుకునేలా కాస్తంతా సూటి రాజకీయాలకు వీలుగా అవకాశం ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఆర్థికంగా హంగు కలిగిన మాగంటి కుటుంబం దాదాపు ఇదే కోరుకుంటోంది. అయితే ఆయన ఎంపీ రేసులో ఉండగానే మరికొద్దిమంది ఈ స్థానాన్ని ఆశిస్తూ వచ్చారు. ఇంతకు ముందున్న రాజకీయాలకంటే ఈసారి రాజకీయాలు తారుమారు కావడం, సామాజిక వర్గాల మధ్య పోటీ తీవ్రం కావడం ప్రధాన పక్షాలన్నీ ఈ తరహాలోనే ఎత్తుగడలు వేయడం లోక్‌సభ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక క్లిష్టంగానే మారింది.

ఏలూరులో బీసీ మంత్రం

వైసీపీ బీసీ వర్గానికి చెందిన కారుమూరి సునీల్‌కుమార్‌ను తమ పార్టీ అభ్యర్థిగా రంగంలోకి దింపింది. చాన్నాళ్ల తర్వాత ఎంపీ స్థానానికి బీసీ ప్రధాన పక్షం నుంచి అభ్యర్థిగా ఆయన తెరముందుకు వచ్చారు. మంత్రి కారుమూరి తనయుడు కావడం, ఆర్థిక పరిపుష్టి కలిగి ఉండడం ఈ రెండింటికి బీసీ మంత్రం తోడైంది. ఇదే తరుణంలో వైసీపీ ఆలోచనలను ముందుగానే ఊహించి టీడీపీ నుంచి తాను పోటీ చేస్తానని చింతలపూడి నియోజవర్గానికి చెందిన గోరుముచ్చు గోపాల్‌యాదవ్ తెర ముందుకు వచ్చారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన ఆయన ఆర్థికంగా నిలదొక్కుకుని ఉండడంతో ఆయన అభ్యర్థిత్వంవైపు టీడీపీ తొంగి చూసింది. మిగతా ఆశావహుల మాదిరిగానే గోపాల్ పేరును పరిశీలనలోకి తీసుకుంది. ఒక దశలో తమ నేతకే ఎంపీ సీటు కేటాయించారంటూ ఆయన మద్దతుదారులు విస్తృత ప్రచారం చేశారు. స్వతహాగా కొన్ని వ్యక్తిగత ఇబ్బందులు ఎదురైనా ఆయన మాత్రం ధైర్యంగానే లోక్‌సభ బరిలో ఉండేందుకు ఇష్టపడుతున్నారు. ఇలా వీరిద్దరితోపాటు ఈ మధ్యనే సడన్‌గా టీడీపీ అధిష్ఠానానికి అత్యంత ఇష్టుడు కంభంపాటి రామ్మోహనరావు పేరు తెర ముందుకొచ్చింది. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లోనూ రామ్మోహనరావు పేరు ప్రముఖంగా వినిపించింది. తిరిగి ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఆయన సుముఖంగా వున్నారని, పరిశీలనలోకి వచ్చిందని పార్టీ వర్గాలు చెబు తున్నాయి. వైసీపీ అభ్యర్థి బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఉండగా రామ్మోహన రావు పేరు పరిశీలనలోకి రావడంతో టీడీపీలో ఒకింత ఆసక్తి పెరిగింది. ప్రత్యేకించి మాగంటి, గోపాల్ వంటి వారితోపాటు ఇంతకు ముందే ధనియాల వెంకటేశ్వరరావు పేరు ప్రముఖంగానే వినిపించింది. విదేశాల్లో వున్న ఆయన ఏలూరు నుంచి బరిలో దిగేందుకు సిద్ధపడటమే కాకుండా ఆ విషయాన్ని పార్టీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగలిగారు. సామాజిక వర్గాల వారీగా కొంత బ్యాలెన్స్ కుదిరిన తర్వాత వెంకటేశ్వరరావు పూర్తి స్థాయిలో అరంగ్రేటం చేస్తారని అందరూ భావించారు. అనుకోని విధంగా కంభంపాటి తెర ముందుకు రావడం ఏలూరులో నివాసానికి ప్రయత్నించడం తాజా పరిణామంగా పరిగణిస్తున్నారు.

> **అంతా ఐదు తర్వాతే..**
>
> జనసేన-టీడీపీ కూటమితో బీజేపీ జత కట్టబోతుందా లేదా అనే దానిపై ఈనెల ఐదో తేదీ తర్వాతే తేలబోతోంది. నేడు, రేపు రెండు రోజులపాటు బీజేపీ రాష్ట్ర నాయకత్వం పార్టీ నేతలతో కీలక భేటీ కాబోతోంది. పొత్తు కుదిరితే కాస్త అటు ఇటుగా సీట్లు కేటాయించడం, లేదంటే మిగిలిన స్థానాల్లోనూ అటో ఇటో తేల్చడానికి టీడీపీ జనసేన కూటమి దాదాపు సిద్ధం చేసుకుంది. అయితే బీజేపీ అత్యధికులు పొత్తుకు దిగాలని భావిస్తుండగా ఇంకొందరు వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలోనే ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ పక్షాన గారపాటి సీతా రామాంజనేయచౌదరి (తపన చౌదరి) పోటీ చేసేందుకు వీలుగా అన్నీ సిద్ధం చేసుకున్నారు. అయనతోపాటు మాజీ ఎంపీ సీఎం రమేష్ పేరు ప్రచారం సాగింది. నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు.

నరసాపురంలో ఇంకో తీరు...

నరసాపురం లోక్‌సభ పరిధిలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఇప్పటి వరకు సినీనటుడు కృష్ణంరాజు, గోకరాజు గంగరాజు, రఘు రామకృష్ణంరాజు వంటి హేమా హేమీలంతా అలవోకగా గెలుపొందారు. అసెంబ్లీ స్థానానికి కాపులకు ప్రాధాన్యత ఇచ్చి లోక్‌సభ స్థానం వచ్చేసరికి క్షత్రియులను సంతృప్తి పరిచేందుకు ప్రయత్నిస్తూ వచ్చారు. ఈ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన గూడూరి ఉమాబాల తెరమీదకు వచ్చారు. నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి మహిళ అభ్యర్థి రంగంలోకి దింపడం ఇదే ప్రథమం. ప్రత్యేకించి బీసీ సామాజిక వర్గాలను తమ వైపు తిప్పుకోవడానికి చేసే ప్రయత్నమే ఇటు నరసాపురంలోనూ రిపీట్ చేశారు. అయితే ఇప్పుడు టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఎవరు ఈ స్థానం నుంచి పోటీ చేయబోతున్నారనే ఆసక్తిగా మారింది. సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు ఈ మధ్యనే వైసీపీతో పూర్తిగా తెగతెంపులు చేసుకున్నారు. కొద్దిరోజుల క్రితం తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభలోను పాల్గొన్నారు. తాను నరసాపురం నుంచే పోటీ చేస్తానని మరోసారి తన మనసులోని మాటను తేల్చి చెప్పారు. ఆయన పోటీ ఖాయమైనప్పటికీ ఏ పార్టీ నుంచి అనేది సస్పెన్స్‌గా మారింది.

నాన్న అలా.. కొడుకు ఇలా..

జనసేనకు జోగయ్య కుమారుడు రాజీనామా.. వైసీపీలో చేరిక

జగన్ దుష్ట పాలనపై స్పందిస్తూనే ఉంటా : జోగయ్య

జగన్ స్వార్థం లేని మనిషి : ప్రకాశ్


హరిరామ జోగయ్య


సూర్యప్రకాశ్

పాలకొల్లు, మార్చి 1 : మాజీ ఎంపీ కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు చేగొండి వెంకట హరిరామ జోగయ్య తనయుడు, ఆచంట నియోజకవర్గ ఇన్‌చార్జ్, పీఏసీ సభ్యుడు చేగొండి సూర్యప్రకాశ్ పార్టీకి, పదవులకు రాజీనామా చేశారు. అనంతరం సీఎం జగన్ సమక్షంలో శుక్రవారం వైసీపీ తీర్థం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. నిన్నటి వరకూ జనసేనాని పవన్ కల్యాణ్‌ను పొగిడిన ప్రకాశ్ ఉన్నట్టుండి పార్టీ ఫిరాయించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంపై తండ్రి జోగయ్య, కుమారుడు ప్రకాశ్‌లు ఇద్దరూ విభిన్నరీతుల్లో స్పందించారు. 'సీఎం వైఎస్ జగన్ అవినీతి, అక్రమాలపై కోర్టులోవున్న వ్యాజ్యాలను వెంటనే విచారణ చేపట్టాలని మీరు హైకోర్టును ఆశ్రయించారు. సంబంధిత అంశంపై తెలంగాణ హైకోర్టు నుంచి కేసు ఫైల్ నెంబర్లు తీసుకున్నారు. జగన్ దుష్ట పాలనకు చరమ గీతం పాడాలంటూ రోజుకో లేఖను సంధిస్తున్నారు. ఈ సమయంలో మీ కుమారుడు వైసీపీలో చేరారు. దీనిపై మీరు ఎలా స్పందిస్తున్నారు ?'అని జోగయ్యను ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా 'నా కుమారుడు ప్రకాశ్ వైసీపీలో చేరడం ఆయన వ్యక్తిగత అభిప్రాయం. రాష్ట్రంలో దుష్ట పాలనపైన, జగన్‌పైన ఇప్పటికీ నా వైఖరి, నా అభిప్రాయం మారలేదు. మారదు కూడా. స్పందిస్తూనే ఉంటాను. టీడీపీ-జనసేనల కలయికపైన నా అభిప్రాయం మారదు. పొత్తులో జనసేనకు సముచిత స్థానం కావాలన్నదే నా పోరాటం. కాపుల సంక్షేమం, జనాభా ప్రాతిపదిక జనసేనకు పొత్తులో ఇవ్వాల్సిన ప్రాధాన్యత, తదితర అం శాల ప్రాతిపదికగా నా ప్రయాణం ఉంటుంది' అని చెప్పారు.

నిన్నటి వరకూ జనసేన పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న చేగొండి సూర్యప్రకాశ్ ఒక్కసారిగా పార్టీ ఫిరాయించి వైసీపీలో ఎందుకు చేరాల్సి వచ్చింది ? అని ప్రశ్నించగా.. 'నాన్న గారిది కులపరమైన ఉద్యమం. నాది రాజకీయ ప్రయాణం. సమాజం మెరుగ్గా ఉండాలంటే అన్ని కులా లను, మతాలను కలుపుకు పోయే నీతివంతమైన ప్రయాణం ఉండాలి. అందుకే జగన్ నాయకత్వాన్ని బల పరుస్తూ పార్టీలో చేరాను. జగన్ స్వార్థం లేని మనిషి. వైసీపీలో ఏ పదవులు ఆశించకుండా పార్టీలో చేరాను. ఇకపై వైసీపీ బలోపేతానికి కృషి చేస్తాను' అని చెబు తున్నారు. వీరిద్దరి అభిప్రాయాలు ఇలా ఉండగా జిల్లాలో మరో రకమైన ప్రచారం జరుగుతోంది. ఇటీవల జోగయ్య పవన్‌కు రాసిన లేఖల్లో తన కుమారుడికి నిడదవోలు స్థానం కేటాయించాలని కోరారు. ఆ సూచనకు తగిన ప్రాధాన్యం లభించలేదు. తాడేపల్లిగూడెం సభలోనూ తనకు ఎవరి సలహాలు అక్కర్లేదని పవన్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తన తండ్రి జోగయ్యకు పవన్ తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆక్రోశం, ఆవేదన ఆయనను వైసీపీ వెళ్లేటట్లు చేశాయని ప్రచారం జరుగుతోంది.


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన , కాపు సంక్షేమ సేన నాయకులు

పవన్ వెంటే జనసైనికులు

ఆచంటలో పితానిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

సూర్యప్రకాష్ ఒక్కరే వైసీపీలో చేరారు

భీమవరం టౌన్, మార్చి 1 : 'ఆచంట నియోజక వర్గంలో వైసీపీలో చేరింది సూర్యప్రకాశ్ ఒక్కరే. మిగిలిన జన సైనికులందరూ పవన్‌తోనే ఉన్నారు' అని ఆచంట నియోజకవర్గ కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు, జనసేన నాయకుడు తోట ఆదినారాయణ చెప్పారు. మార్టేరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సూర్య ప్రకాశ్ సొంత ప్రయోజనాల కోసమే పార్టీ మారారు. మీ తండ్రిని చూసి ఇప్పటివరకు మీకు గౌరవం ఇచ్చాం. ఏ రోజూ పవన్ ఆశయాల కోసం మీరు పనిచేయలేదు. ఈ ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి పితాని సత్యనారాయణను భారీ మెజారిటీతో గెలిపిస్తాం' అని స్పష్టం చేశారు. జనసేన జిల్లా కార్యదర్శి చిత్తూరు శ్రీనివాస్ మాట్లాడుతూ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన తనకు జిల్లా కార్యదర్శి బాధ్యతలు ఇచ్చారని మతాలకు, కులాలకతీతంగా పార్టీని నడిపించే వ్యక్తి పవన్ కల్యాణ్ అని అన్నారు. పార్టీ నాయకులు షేక్ అలీ, రావి హరీష్, షేక్ ముంతాజ్ బేగం, కంబాల బాబులు, కడిమి శ్రీనివాస్, ఎడ్లపల్లి గంగాధర్ తదితరులు ప్రకాశ్ తీరును తప్పుపట్టారు.



సొమ్ములు ఇచ్చి శిక్షణ పొందండి..!



- పోలీస్ శాఖలో వింత ధోరణి
- గతంలో శిక్షణ ఇస్తే టీఏ, డీఏల చెల్లింపు
- ప్రస్తుతం డీఏ సొమ్ము శిక్షకులు కట్టాల్సిందే
- పెదవేగి డీటీసీలో రూ.240 వసూలు

ఏలూరు క్రైం, మార్చి 1 : ప్రభుత్వ ఉద్యోగాలకు శిక్షణ ఇవ్వాలంటే రవాణా భత్యం (ట్రావెలింగ్ అలవెన్స్ ఆహార పదార్థాల భత్యం (డైట్ అలవెన్స్) ఇస్తారు. ఇది ఇప్పటి వరకు ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణంగా జరిగే విధానం. కానీ ఇటీవల పోలీస్ శాఖలో ఓ వింత ధోరణి మొదలు పెట్టారు. ఏలూరు సమీపంలోని పెదవేగి పోలీస్ శిక్షణ కేంద్రంలో పోలీసులకు అంతర్గత పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తుంటారు. ఈ తరగతులకు హాజరయ్యే సిబ్బంది ఖచ్చితంగా వారి రవాణా వారే కల్పించుకోవాలి. అక్కడ రెండు సార్లు టీ, ఒకసారి పెట్టే కూరగాయల భోజనానికి రూ.240 చెల్లించి శిక్షణ పొందాలి. ఇది ప్రస్తుతం పెదవేగి డీటీసీలో జరిగే తంతు. ఈ ఉత్తర్వులు ఎవరు ఇచ్చారో ఎవరికి తెలియదు ? క్రమశిక్షణ కలిగిన పోలీస్‌శాఖ కాబట్టి పై అధికారులు ఆదేశిస్తే తూచా తప్పకుండా కింద సిబ్బంది అంగీకారం తెలపాల్సిందే.

సాధారణంగా పోలీస్ శాఖలో అంతర్గత శిక్షణలో ఇచ్చిన, ఎన్నికల మీద శిక్షణలు ఇచ్చినా అందుకు బిల్లులను ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉంటుంది. కానీ ప్రస్తుతం ఈ బిల్లులు ఎవరు డ్రా చేస్తున్నారో ఎవరు పెట్టుకుంటున్నారో తెలియదు. శిక్షణకు వెళ్లే పోలీస్ సిబ్బందికి రూ.50 విలువ చేసే భోజనం పెట్టి రూ.240 కట్టించుకుంటున్నారని, తాము క్యారేజీ తెచ్చుకుంటామని చెప్పినా కుదరని చెబుతున్నారని పేరు బయటకు చెప్పడానికి ఇష్టపడని కొంతమంది సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యత లేకున్నా తప్పని సరిగా ఆకలి తీర్చుకోవడానికి తినాల్సి వస్తోందని వాపోయారు. ప్రస్తుతం ఎన్నికలు కోడ్ అమలు లేకపోయినా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల పరిస్థితి, నియమావళిపై అవగాహన శిక్షణను నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లాకు చెందిన పోలీసులకు ఏలూరు సమీపంలోని ఒక ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించగా ఉచితంగానే భోజన వసతి కల్పించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పోలీస్ సిబ్బందికి పెదవేగి డీటీసీలో శిక్షణ ఇస్తున్నారు. వారికి మాత్రం భోజన వసతి నిమిత్తం రూ.240 చెల్లించాలని మెస్సేజ్‌లు పంపడంతో చివరకు శిక్షణకు హాజరైన 82 మంది కట్టారు. వారికి పెట్టిన భోజనం విలువ రూ.50 కూడా ఉండదని వాపోతున్నారు. ఈ విషయం జిల్లా ఎస్పీ, డీటీసీ ప్రిన్సిపాల్ జి.స్వరూపరాణి దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా.. 'నేను కొత్తగా వచ్చాను. ఇలా భోజనానికి డబ్బులు వసూలు చేయడానికి నిబంధనలు ఏమైనా ఉన్నాయో లేదో విచారణ చేపడతాను. భోజనంలో నాణ్యత ఉందో లేదో కూడా తెలుసుకుంటాను'.. అని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


సీఆర్ఆర్ రెడ్డి కాలేజీ వద్ద నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

- 95 శాతం విద్యార్థుల హాజరు
- కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరీక్ష గదుల పర్యవేక్షణ
- విద్యుత్ కోతలు.. ఉక్కపోతలు
- పరీక్షార్థులు అవస్థలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 1 : ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజున జరిగిన ప్రథమ సంవత్సరం తెలుగు/సంస్కృతం/హిందీ/ఉర్దూ పరీక్షకు జిల్లాలో మొత్తం 16,029 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 15,275 మంది హాజరయ్యారు. మరో 754 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగం నుంచి 13,328 మంది, ఒకేషనల్ విభాగం నుంచి 1947 మంది ఉన్నారు. మొత్తం 51 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షల తీరుని నేరుగా సీసీ కెమెరాలను అనుసంధానం చేయడం ద్వారా ఏలూరు కోటదిబ్బలోని డీవీఈవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ద్వారా పర్యవేక్షించారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదని పరీక్షల కన్వీనర్, డీవీఈవో ప్రభాకరరావు తెలిపారు. డీవీఈవో ఏలూరులోని సీఆర్ఆర్, సెయింట్ థెరిస్సా, పి.డి.బి.టి. జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు చేసిన వారిలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు కె.యోహాన్, జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎం.పేర్రాజు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు 144వ సెక్షన్‌ను విధించారు. ప్రవేశ ద్వారాల వద్దే విద్యార్థులతో పాటు, పరీక్షల సిబ్బందిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోనికి అనుమతించారు.


సీఆర్ఆర్ రెడ్డి కాలేజీ వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

> **విద్యుత్ కోతలతో చెమటోడ్చారు..**
>
> జిల్లాలో పలుచోట్ల పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ కోతలతో విద్యార్థులు చెమటోడ్చారు. జంగారెడ్డిగూడెంలోని ఓ పరీక్షా కేంద్రంలో ఏకంగా పది నిమిషాల పాటు రెండు దఫాలు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇదే పరిస్థితి మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల పరీక్షా కేంద్రాల్లో తలెత్తింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల పరీక్షార్థులకు అసౌకర్యంతో పాటు, సీసీ కెమెరాలు పని చేయలేదు. కొన్ని పరీక్ష గదుల్లో ఫ్యాన్లు పనిచేయలేదని తెలిసింది. కొన్ని కళాశాలలకు జనరేటర్లు ఉన్నప్పటికీ వినియోగించలేదు. పరీక్షలు జరుగుతున్న సమయంలో అవాంతరాలులేని నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందని ప్రభుత్వం చెప్పిన మాటలు వట్టికబుర్లేనని రుజువైంది. కొన్నిచోట్ల ఇరుకైన గదుల్లో, రేకుల షెడ్లలో పరీక్షలను నిర్వహించగా, మరికొన్నిచోట్ల వెలుతురు సరిగాలేని గదుల్లో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు.

> **సీవోలు, డీవోలతో టెలీ కాన్ఫరెన్స్**
>
> పరీక్ష ముగిసిన వెంటనే జిల్లాలో తొలిరోజు ఎక్కడైనా లోటుపాట్లుఉంటే తెలుసుకుని వాటిని శనివారం నుంచి ప్రారంభమయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షల నాటికి సరిదిద్దేందుకు ఇంటర్ బోర్డు కమిషనర్, డీవీఈవో పరీక్షా కేంద్రాల సీవోలు, డీవోలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు చేశారు. జిల్లాలో పరీక్షలు జరుగుతున్న ఏ ఒక్క కళాశాల/పరీక్ష కేంద్రంలో మరుసటిరోజు పరీక్షలకు సంబంధించిన సబ్జెక్టుకు స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని ఆదేశించారు. పరీక్ష గదుల్లో అమర్చిన సీసీ కెమెరాల డైరెక్షన్ సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో స్పష్టంగా కనబడేలా ఉండేలా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

7,773 దరఖాస్తుల పరిష్కారం

» కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు సిటీ, మార్చి 1 : జిల్లాలో వారం రోజుల్లో ఓటరు చేర్పులు, మార్పులు, తొలగింపులకు సంబంధించి 7,773 దరఖాస్తులు పరిష్కరించామని, మరో 3,752 దరఖాస్తులు పరిష్కార దిశలో ఉన్నాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు తెలిపారు. విజయవాడ ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం నుంచి శుక్రవారం ఓటర్ల సవరణ దరఖాస్తులు , ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీస్థితి, శిక్షణ కార్యక్రమాలు, ఫిర్యాదులు, ప్రతికూల వార్తలు, డీఈఎంపీ, జిల్లా కంట్రోల్ రూమ్/ సోషల్ మీడియాసెల్ ఏర్పాటు, ఫిర్యాదు నిర్వహణ వ్యవస్థ/ నివేదిక నిర్వహణ వ్యవస్థ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నుంచి జిల్లా నోడల్ అధికారుల నియామకం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జిల్లాలోని వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులైన జేసీ లావణ్యవేణి, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ, నూజివీడు, జంగారెడ్డిగూడెం ఆర్డీవోలు వై.భవాని శంకరీ, కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, కె.భాస్కర్, ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు హాజరయ్యారు. ఓటర్ల జాబితాపై దినపత్రికల్లో 30 వార్తాంశాలు ప్రచురితం కాగా వాటిపై చర్యలు తీసుకున్నా మని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 1,743 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ఏఈఆర్వో, ఎస్‌హెచ్‌వో, సెక్టార్ అధికారులు, కొత్తగా తహసీల్దార్లు పరిశీలించాలని సూచించామన్నారు. రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తవుతుందన్నారు. నేడు (శనివారం) సెక్టార్ అధికారులకు, 4వ తేదీన ఎన్నికల వ్యయ మోనటరింగ్ కమిటీలకు సంబంధించి శిక్షణ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీ స్థితి తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి కలెక్టర్ వివరించారు.

పడవ రేవు వేలం పాట రూ.80 లక్షలు

వేలేరుపాడు, మార్చి 1 : రుద్రమకోట, అల్లూరి జిల్లా కూనవరం మధ్య గోదావరిలో పడవ నిర్వహణకు రికార్డు స్థాయిలో ధర పలికింది. రుద్రమకోట, కూనవరం పంచాయతీలు ఉమ్మడిగా నిర్వహించే ఈ పడవ రేవుకు శుక్రవారం కూనవరంలో బహిరంగవేలం నిర్వహించారు. వేలంలో పాల్గొన్న వారు పోటీ పడి ధరలు పెంచడంతో గతేడాది రూ.36 లక్షలు పలికిన వేలం ఈసారి రూ.80 లక్షలకు భారీగా పెరిగింది. కూనవరం మండలానికి చెందిన వాళ్ల బాపూజీ అనే వ్యక్తి పడవ రేవును దక్కించుకున్నాడు. పడవ రేవుకు భారీగా ఆదాయం సమకూరడంతో ఈ రెండు పంచాయతీలకు ఆదాయం గణనీయంగా పెరగనుంది.

'టెట్'కు 59 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 1 : జిల్లాలో శుక్రవారం జరిగిన 'టెట్'కు జిల్లాలో ఉదయం సెషన్‌కు 338 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 343 మంది అభ్యర్థులు హాజరయ్యారని, 59 మంది గైర్హాజరైనట్టు డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.


కలిదిండిలో మేరీమాత ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, పాస్టర్లు

వైభవంగా మేరీమాత ఉత్సవాలు

కలిదిండి, మార్చి 1 : కలిదిండిలో శుక్రవారం మేరీమాత ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విచారణ కర్త బంటుమిల్లి యోహాను ఆధ్వర్యంలో దివ్యపూజ బలి, జపమాల తదితర పూజలు నిర్వహించారు. చర్చిలో భక్తులు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మేరీమాత స్వరూపాన్ని పురవీధుల్లో కోలాటం, ప్రార్థనలు చేస్తూ ఊరేగించారు. అధిక సంఖ్యలో విశ్వాసకులు పాల్గొన్నారు. ఎస్ఐ ప్రియ కుమార్ బందోబస్తు నిర్వహించారు.

ఎంఎస్‌ఎంఈ సర్వే విజయవంతం చేయాలి : కలెక్టర్‌

ఏలూరు కలెక్టరేట్‌, మార్చి 1:ఎంఎస్‌ఎంఈ సర్వేను విజయవంతం చేయాలని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను మరింత ప్రోత్సహించేందుకు ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించే సర్వేటీంకు పరిశ్రమల అసోసియేషన్లు, వర్తక వాణిజ్య సంఘాలు సహకరించాలని కలెక్టర్‌ వైప్రసన్నవెంకటేశ్‌ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఎంఎస్‌ఎంఈ అవగాహన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల పనితీరును మెరుగుపరిచి డేటాబేస్‌ అభివృద్ధి పరిచేందుకు జిల్లాలో సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వే వల్ల పలు కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందేందుకు అర్హులవుతారన్నారు. బ్యాంకు రుణ సదుపాయాలు సులువు అవుతాయన్నారు. ఈ సర్వేను జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో అమెనెటీ సెక్రటరీలు చేస్తారన్నారు. ఎంపీడీవోలు, మునిసిపల్‌ కమిషనర్ల ద్వారా సర్వే పురోగతిని పర్యవేక్షిస్తారన్నారు. కార్యక్రమంలో డీఐసీ జిల్లా పరిశ్రమల అధికారి వి.ఆదిశేషు తదితర అధికారులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాదీవెన నిధుల జమ

ఏలూరు కలెక్టరేట్‌, మార్చి 1 : జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకం కింద అక్టోబరు, నవంబరు 2023 ఏడాదికి సంబంధించి 32,452 మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లులు విద్యార్థుల జాయింట్‌ బ్యాంక్‌ ఖాతాలకు రూ.26.42 కోట్లు నిధులు విడుదల చేసినట్టు కలెక్టర్‌ ప్రసన్న వెంకటేశ్‌ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు సోషల్‌ వెల్ఫేర్‌ జేడీ జయప్రకాష్‌, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆర్‌.వి నాగరాణి, మైనార్టీసంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు. విద్యార్థులకు నమూనా చెక్కును కలెక్టర్‌ అందజేశారు.

కొండరెడ్డి గ్రామంలో ట్రైనీ కలెక్టర్‌ పర్యటన



కొండరెడ్డి మహిళలతో మాట్లాడుతున్న శ్రీపూజ

బుట్టాయగూడెం, మార్చి 1 : ట్రైనీ కలెక్టర్‌ శ్రీపూజ శుక్రవారం మండలంలోని కొండరెడ్డి గ్రామం అలివేరులో ట్రైనీ కలెక్టర్‌ శ్రీపూజ శుక్రవారం పర్యటించారు. అక్కడి మహిళలతో మాట్లాడుతూ జీవన విధానాలను, సంస్కృతి సంప్రదాయాలు, విద్యా, వైద్యం తదితర పథకాలు అందుతున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలను తప్పకుండా బడికి పంపాలని విద్యా ద్వారానే ఏదైన సాధించవచ్చని సూచించారు. ట్రైనింగ్‌లో భాగంగా ఇక్కడకు వచ్చానని, కొండరెడ్ల జీవన విధానం ఎంతగానో బాగుందన్నారు. సర్పంచ్‌ కారం లక్ష్మి తదితరులు ఉన్నారు.

పోలీస్‌ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట : ఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 1 : పోలీస్‌ సిబ్బందికి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం గ్రీవెన్స్‌ డేను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పోలీసు, ఏఆర్‌ సిబ్బంది, హోంగార్డ్స్‌ వారి సమస్యలపై నేరుగా ఆమె వినతులను స్వీకరించారు. వాటి పరిష్కారానికి అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ

ఏలూరు టూటౌన్‌, మార్చి 1 : నగర పరిధిలోని ఆస్తిపన్ను, ఖాళీస్థలాల పన్ను చెల్లింపుదారులకు వడ్డీ మాఫీ చేస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్‌ ఎస్‌. వెంకటకృష్ణ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ఈ నెలాఖరుతో ముగుస్తుందన్నారు. ఈనెల 31వ తేదీ లోపు ఆస్తిపన్ను, ఖాళీస్థలాల పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో పన్నుల వసూళ్ల కౌంటర్ల వద్ద చెల్లించాలన్నారు. ఆన్‌లైన్‌ ద్వారా, నెట్‌ బ్యాంకింగ్‌ ద్వారా, డెబిట్‌, క్రెడిట్‌ కార్డు, యూపీఐ ద్వారా పన్నులు చెల్లించవచ్చన్నారు.

నేడు కలెక్టరేట్‌ వద్ద సర్పంచ్‌ల ఆందోళన

ఏలూరు రూరల్‌, మార్చి 1 : గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యానికి వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచిందని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు తమ సమస్యలు పరిష్కరించాలంటూ శనివారం కలెక్టరేట్‌ వద్ద ఆందోళన, ధర్నా నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ జిల్లాల సర్పంచ్‌ల ఛాంబర్‌ అధ్యక్షుడు కడలి గోపాలరావు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు స్పష్టం చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీల ఉనికికే ప్రమాదం ఏర్పడిందన్నారు. పంచాయతీల హక్కులను రాష్ట్రప్రభుత్వ హరిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమానికి సర్పంచ్‌ల చాంబర్‌ రాష్ట్ర అధ్యక్షుడు బాబూరాజేంద్రప్రసాద్‌, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు.

తొమ్మిది మంది చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు క్రైం, మార్చి 1 : తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి కోసం రక్తం అవసరం అవుతుందని రక్తదాతలు ముందుకు రావాలని జిల్లా రెడ్‌క్రాస్‌ ఛైర్మన్‌ బివి కృష్ణారెడ్డి కోరారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్‌ భవనంలో తొమ్మిద మంది తలసేమియా చిన్నారులకు డాక్టర్‌ పీఏఆర్‌ఎస్‌ శ్రీనివాసరావు రక్తమార్పిడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులను పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తలసేమియా చిన్నారులతో పాటు వారి కుటుంబ సభ్యులకు సీనియర్‌ సిటిజన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు, మానవతా సభ్యులు ఎం.బి. శంకరరావు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌ కార్యదర్శి కేబీ సీతారామ్‌, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారెడ్డి, రెడ్డి, పీఆర్వో కేవీ రమణ పలువురు పాల్గొన్నారు.

ప్రవీణ్‌ ప్రకాశ్‌ పర్యటన వాయిదా

ఏలూరు ఎడ్యుకేషన్‌, మార్చి 1:ఉపాధ్యాయవర్గాల్లో కలవరం పుట్టిస్తోన్న పాఠశాలవిద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ ప్రకాశ్‌ శనివారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల సందర్శన వాయిదాపడింది. ప్రకాశం జిల్లాకు ఆయన వెళుతున్నందున జిల్లాకు శనివారం రావడంలేదని, మరో రోజు వస్తారని విద్యాశాఖవర్గాలు వివరించాయి. ప్రతీ శుక్ర, శనివారాల్లో జిల్లాల్లోని పాఠశాలల సందర్శనకు వస్తున్న విషయం విదితమే.

ఏఆర్‌ డీఎస్పీగా శ్రీహరిరావు

ఏలూరు క్రైం, మార్చి 1 : ఏలూరు జిల్లా ఆర్మ్‌డ్‌ రిజర్వుడు డీఎస్పీగా వీజీ శ్రీహరిరావును నియమిస్తూ రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బాపట్ల డిస్ట్రిక్ట్‌ ఆర్మ్‌డ్‌ రిజర్వుడు విభాగంలో రిజర్వు (ఆర్‌ఐ)గా పనిచేస్తున్న వీజీ శ్రీహరిరావుకు డీఎస్పీగా పదోన్నతి కల్పించి ఏలూరు జిల్లా ఏఆర్‌డీఎస్పీగా నియమించారు. రాష్ట్రంలో నలుగురు ఆర్‌ఐలుకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పించారు.

ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక మోసాలపై అవగాహన

ఏలూరు ఎడ్యుకేషన్‌, మార్చి 1 :ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సెయింట్‌ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినులకు యూనియన్‌ బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్‌ బ్యాంకు లావాదేవీలు, జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్‌) స్కీంలను నాబార్డ్‌ జిల్లా మేనేజర్‌ అనీల్‌కాంత్‌, రిటైర్డ్‌ మేనేజర్‌ వర్మ వివరించారు. ముఖ్యంగా సైబర్‌ ఆర్థిక మోసాల భారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. సదస్సులో తెలుసుకున్న విషయాలను ఇంటివద్ద తల్లిదండ్రులకు కూడా వివరించి వారిని చైతన్యపర్చాలన్నారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ మెర్సీ, కామర్స్‌ హెచ్‌వోడీ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు జగదీశ్వరి, హారిక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్‌ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ

పెదపాడు, మార్చి 1 :యూనియన్‌ గ్రామీణ స్వయం ఉపాధిశిక్షణ ఆంధ్రాబ్యాంక్‌ ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతి, యువకులకు ఫ్యాషన్‌ డిజైనింగ్‌ (టైలరింగ్‌), కంప్యూటర్‌ టాలీ, ఎంఎస్‌ ఆఫీసులో ఉచిత శిక్షణ అందజేస్తామని సంస్థ డైరెక్టర్‌ శశిధర్‌ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 30 రోజుల ఉచిత శిక్షణలో భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామని, ఫ్యాషన్‌ డిజైనింగ్‌కు ఐదో తరగతి ఆపైన, కంప్యూటర్‌ టాలీకి పదో తరగతి ఆపైన విద్యార్హత వున్నవారు అర్హులన్నారు. 19-45 ఏళ్ల వయస్సు గల గ్రామీణ ప్రాంత యువత దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99485 65256, 95027 23561 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బీఎస్పీని గెలిపించండి : రమేశ్‌బాబు

ఏలూరుటూటౌన్‌, మార్చి 1: రాబోయే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలంతా బీఎస్పీని గెలిపించాలని పార్టీ దెందులూరు నియోజకవర్గ అభ్యర్థి నేతల రమేష్‌బాబు అన్నారు. పాతబస్టాండ్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నుంచి బీఎస్పీ ఆధ్వర్యంలో చైతన్యప్రచార రథాన్ని ప్రారంభించారు. జి.వెంకటేశ్వరరావు, అంబేడ్కర్‌, రవి, పాల్గొన్నారు.

పెదయాగనమిల్లిలో విలేజ్‌ క్లినిక్‌ ప్రారంభం

ఏలూరు రూరల్‌, మార్చి 1 :పెదయాగనమిల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్సార్‌ విలేజ్‌ క్లినిక్‌ను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రారంభించారు. శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ డ్రెయిన్‌ను, రూ.50లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును రూ.15లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏలూరు ఎంపీపీ టి.శ్రీనివాసరాజు, జడ్పీటీసీ మండల సరస్వతి కొండలరావు, ఎంపీడీవో బండి ప్రణవి, తేరా ఆనంద్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు చేబ్రోలు సొసైటీ సాధారణ సమావేశం

ఉంగుటూరు, మార్చి 1: చేబ్రోలు సొసైటీ సర్వ సభ్య సమావేశం శనివారం సాయంత్రం నాలుగు గంటలకు జరుగుతుందని త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌ యెలిశెట్టి పాపారావు బాబ్జి, కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు తెలిపారు. సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.





ఏలూరులో మహిళతో మాట్లాడుతున్న బడేటి చంటి, చింతలపూడిలో సూపర్‌ సిక్స్‌ పథకాల ప్రదర్శనలో సొంగా రోషన్‌కుమార్‌, తదితరులు

రాష్ట్ర భవిష్యత్తు కోసమే టీడీపీ, జనసేన పొత్తు

టీడీపీ-జనసేన ఏలూరు అభ్యర్థి బడేటి చంటి

ఏలూరుటూటౌన్‌, మార్చి 1 : రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన చేయి కలిపిందని ఉమ్మడి అభ్యర్థి బ డేటి రాధాకృష్ణయ్య (చంటి) పేర్కొన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా శాంతినగర్‌లో శుక్రవారం ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సైకో జగన్‌ను ఓడించాలంటే టీడీపీ జనసేన పొత్తు తప్పనిసరి అన్నారు. వైసీపీని తరిమికొట్టేందుకు అన్ని వర్గాలు దగ్గరవుతున్నాయని అన్నారు. బటన్‌ నొక్కుడు పేరుతో పేద ప్రజలను ఏ విధంగా జగన్‌ పీక్కుతింటున్నాడో అర్థం చేసుకోవాలన్నారు. రెండు పార్టీల పొత్తుతో జగన్‌కు కంటిమీద కునుకు కరువైందన్నారు. వైసీపీ అరాచకాలు తారాస్థాయికి చేరాయని ఆ పార్టీకి ఎప్పుడు సమాధి కడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఎ.రామకృష్ణ, భాస్కరరావు, కె.కిషోర్‌, వై.శ్రీనివాస్‌, బాబూరావు, సీహెచ్‌ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌-6 పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : సొంగా

చింతలపూడి, మార్చి 1:రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సూపర్‌-6 పథకాలను ప్రజల్లోకి ఇంటింటికి తీసుకువెళ్ళాలని టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్‌ పేర్కొన్నారు. స్థానిక నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బూత్‌ కన్వీనర్లు, క్లస్టర్‌ ఇన్‌చార్జిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి బాబు ష్యూరిటీ భవిష్యత్‌ గ్యారెంటీ పథకంలో సూపర్‌-6 పథకాలను ఆయన వివరించారు. నిరుద్యోగులకు మూడు వేల భృతి, కుటుంబంలో చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు, ప్రతీ రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం, మూడు ఉచిత గ్యాస్‌ కనెక్షన్లు, ప్రతీ మహిళకు నెలకు రూ.1500, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు జరుగుతాయని, వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం మాజీ కన్వీనర్‌ జె.ముత్తారెడ్డి మాట్లాడారు. టీడీపీ నాయకులు మాటూరి వెంకట్రామయ్య, పక్కాల వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, అనీష్‌కుమార్‌, నాగభూషణం, కోండ్రు దేవ పాల్గొన్నారు.

టీడీపీ-జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి

జంగారెడ్డిగూడెం, మార్చి 1 : టీడీపీ జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చింతలపూడి నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్‌ తెలిపారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం పట్టణ టీడీపీ కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు రావూరి కృష్ణ అధ్యక్షతన పార్టీ కార్యాచరణ, బలోపేతంపై క్లస్టర్‌, యూనిట్‌, బూత్‌ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయనతో పాటు చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి తూటికుంట రాము, పెనుమర్తి రాంకుమార్‌, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్‌, నంబూరి రామచంద్రరాజు, కరుటూరి రమాదేవి, పగడం సౌభాగ్యవతి, చిట్రోజు తాతాజీ, గొళ్ళపూడి శ్రీదేవి, గుమ్మడి ప్రసాద్‌, చేను ప్రసాద్‌, క్లస్టర్‌ ఇన్‌చార్జిలు కంచర్ల గణేష్‌, బేతాళ మురళీకృష్ణ, యూనిట్‌, బూత్‌ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పల్స్‌ పోలియోకు ఏర్పాట్లు పూర్తి

గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు



కోటలో వైద్య ఆరోగ్య సిబ్బంది మానవహారం



లింగపాలెంలో వైద్యసిబ్బంది ర్యాలీ

కామవరపుకోట, మార్చి 1 : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 3వ తేదీన కామవరపుకోట మండలంలో పల్స్‌ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్‌ తాతా కుమార్‌ తెలిపారు. మండలంలో 48 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక కేంద్రం, మొబైల్‌ వ్యాను ద్వారా పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఆదివారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. మండలంలో 5,186 మంది పిల్లలున్నారన్నారు. పోలియో చుక్కలు వేసుకోని వారిని గుర్తించి 4, 5 తేదీల్లో తమ సిబ్బంది ఇంటింటికి వెళ్లి చుక్కలు వేసి నూరుశాతం ప్రగతి సాధించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు.

- లింగపాలెం, మార్చి 1: లింగపాలెంలో డాక్టర్‌ నైమిషా ఆధ్వర్యంలో పల్స్‌ పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 3,4,5వ తేదీల్లో పోలియో నివారణ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. నల్ల అప్పారావు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు, ఆశాలు, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- భీమడోలు, మార్చి 1 : పాతూరు గ్రామంలో ఎంపీపీ పాఠశాల విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది పల్స్‌ పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గుండుగొలను పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎం పి.నిర్మలా కుమారి నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. పోలియో చుక్క చిన్నారులకు ఆరోగ్య రక్ష అని హెచ్‌ఎం నిర్మలా కుమారి సూచించారు. ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు మండే సుధాకర్‌, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు, మార్చి 1 : మండలంలోని చేబ్రోలు, కాగుపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆదివారం పల్స్‌ పోలియో కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్‌ వర్మ, డాక్టర్‌ శ్రావణ్‌ రెడ్డి. డాక్టర్‌ మానస తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పీహెచ్‌సీలలో మైక్‌ ప్రచారాలు నిర్వహించారు.



ఏలూరు సీఆర్‌రెడ్డి కాలేజీలో మాట్లాడుతున్న వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కామవరపుకోటలో హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

నిస్వార్థపరులను చట్టసభలకు ఎన్నుకుందాం

పెదపాడు, మార్చి 1 : చట్టసభల గౌరవాన్ని కాపాడే నిస్వార్థ నేతలను ఓటు హక్కు ద్వారా ఎన్నుకుందామని సిటిజన్స్‌ ఫర్‌ డెమొక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కోరారు. వట్లూరు సర్‌ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్‌ కళాశాలలో 'ఓటు వేద్దాం-ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' అనే అంశంపై కళాజాత కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో పుచ్చలపల్లి సుందరయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, ఎన్‌.జి.రంగ, గౌతు లచ్చన్న వంటి మహనీయులు మంచి ప్రసంగాలతో ప్రజలకు తోడ్పడే చట్టాల రూపకల్పలో కృషి చేస్తే, ప్రస్తుతం బూతులు, ఘర్షణలు, ప్రతీకార చర్యలతో చట్టసభలు కొద్దిరోజులు మాత్రమే పనిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సత్‌ప్రవర్తన, సుపరిపాలన, అభివృద్ధికి తోడ్పడే వారిని గెలిపించాలని కోరారు. అనంతరం ఓటర్లను చైతన్యపరిచే గేయాలు, జానపదాలు, నృత్య నాటికలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్‌ డాక్టరు కె.వెంకటేశ్వరరావు, కంప్యూటర్‌ సైన్సు హెచ్‌వోడీ ఎ.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది వంటిది

కామవరపుకోట, మార్చి 1:ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది వంటిదని చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పొలిటికల్‌ సైన్స్‌ అధ్యాపకుడు కె.హరిప్రసాద్‌ తెలిపారు. స్థానిక ప్రభుత్వ మోడల్‌ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పొలిటికల్‌ సైన్స్‌ విభాగం ఆధ్వర్యంలో భారతదేశంలో ఓటర్ల ప్రవర్తన అంశంపై కళాశాల ప్రిన్సిపాల్‌ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన సెమినార్‌ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యతని తెలిపారు. అనంతరం ఆయనను సత్కరించారు. ఐక్యూఏసి కో-ఆర్డినేటర్‌ డాక్టర్‌ జి.శ్రీనివాసరావు, పొలిటికల్‌ సైన్స్‌ విభాగం అధ్యాపకులు డి.మల్లేష్‌, వి.శ్రీనివాస్‌, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పంట నమోదు చేయించుకోవాలి



ఈకేవైసీ పత్రాలను చూపుతున్న వ్యవసాయ అధికారులు

లింగపాలెం, మార్చి 1: ప్రతి ఒక్కరూ పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం భోగోలులో పంట నమోదు పత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటనమోదు కోసం ఈకేవైసీలో నమోదు చేసుకున్న వారి పేర్లను మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులు చూసేందుకు ప్రదర్శించామని వాటి ద్వారా ఇంకా ఎవరైనా రైతులు తమ పంటనమోదు చేయించుకోకుండా ఉంటే వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఈనెల 3వ తేదీ వరకు ఈకేవైసీ నమోదు చేస్తారని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్బీకేల్లో జాబితాలను పరిశీలించుకోవాలి'

పెదపాడు, మార్చి 1 : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ, గ్రామ సచివాలయాల్లో రబీ - 2023కి సంబంధించి పంట నమోదు రైతుల తుది జాబితాలను సామాజిక తనిఖీ కోసం అందుబాటులో ఉంచామని ఏవో వి.ప్రవీణ్‌కుమార్‌ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తుది జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే వాటిని గ్రీవెన్స్‌ రూపంలో తీసుకుని సరి చేస్తామన్నారు. ఈనెల రెండో తేదీన రైతు భరోసా కేంద్రాల వద్ద గ్రామసభలు నిర్వహిస్తామని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రైతులు శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌

ఏలూరు రూరల్‌, మార్చి 1:వ్యవసాయ రంగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న శాస్త్రసాంకేతికతను అందిపుచ్చుకుని సాగు చేయడం ద్వారా రైతులు అధికదిగుబడులు సాధించవచ్చని మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంచాలకుడు డాక్టర్‌ టి.శ్రీనివాస్‌ అన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రైతాంగానికి సేవలు అందిస్తున్న ఏలూరులోని ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని శాస్త్రీయంగా చేపట్టి పరిశోధన ఫలితాలను రైతుల ముంగిట చేర్చుతున్నారన్నారు. జిల్లా రైతులు ఈ పరిశోధనా ఫలితాలను అందిపుచ్చుకుని నాణ్యమైన అధిక దిగుబడులు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఏరువాక కేంద్రం ఏలూరు కో-ఆర్డినేటర్‌ డాక్టర్‌ టి.సుజాత గత ఏడాది చేపట్టిన వ్యవసాయ విస్తరణ, సార్వా, దాళ్వాసాగులో చేపట్టిన కార్యక్రమాల నివేదికను నివేదించారు. విస్తరణ సంచాలకుడు డాక్టర్‌ బి.విశాలక్ష్మి, వ్యవసాయశాఖ అధికారి షేక్‌ బాషా తదితరులు మాట్లాడారు. శాస్త్రవేత్తలు కె.ఫణికుమార్‌, ఎం.నాగేంద్రబాబు, ఎన్‌.చాముండేశ్వరి, ఉద్యానఅధికారి ఎస్‌.రామ్మోహన్‌, నాబార్డు అసిస్టెంట్‌ మేనేజరు అనిల్‌కాంత్‌, ఏరువాక కేంద్రం సమన్వయకర్త టి.సుజాత, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్‌ రీడర్లకు పనిదినాలు అమలు చేయాలి

ఏలూరుటూటౌన్‌, మార్చి 1: విద్యుత్‌ మీటర్‌ రీడర్లకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పని దినాలు అమలు చేయాలని ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి అప్పలరాజు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు విద్యుత్‌ ఎస్‌ఈకి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రీడర్లకు 11 పనిదినాలు ఉండేలా ఎస్క్రో అకౌంట్‌ ఓపెన్‌ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్‌ చేశారు. మీటర్‌ రీడర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కోశాధికారి మల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, శ్రీధరరావు, అప్పలస్వామి పాల్గొన్నారు.

రామకోటి ఉత్సవాల్లో అనఘాష్టమి వ్రతాలు



ఏలూరు కార్పొరేషన్‌, మార్చి1:స్థానిక అగ్రహారంలోని రామకోటి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దొండపాడులోని శ్రీనం దత్తనాథ క్షేత్రంవారి ఆధ్వర్యంలో అనఘాష్టమి వ్రతాలను భక్తులతో సామూహికంగా నిర్వహించారు. శ్రీ దత్త సద్గురుకు పుష్పార్చనలు నిర్వహించారు. కళావేదికపై శ్రీమత్‌ భగవద్గీత ద్వాదశోధ్యాయము-భక్తియోగంలను కోటమర్తి బ్రహ్మేశ్వరి వివరించారు. స్థానిక రామాంజనేయ నాట్య మండలి వారు రామాంజనేయ యుద్ధం నాటకాన్ని ప్రదర్శించారు. ఈనెల 17వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు.

అంబికాదేవి సన్నిధిలో కుంకుమార్చనలు

ఏలూరుకార్పొరేషన్‌, మార్చి 1:మాఘమాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని సత్రంపాడు ఇండస్ట్రియల్‌ ఏరియాలో గల విశాఖపాలిత అంబికాదేవి సన్నిధిలో ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో సామూహికంగా రాహుకాల శ్రీచక్రకుంకుమార్చనలను నిర్వహించారు. అంబికా కుటుంబ సభ్యులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబ అమ్మవారి సన్నిధిలో మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు జరిపారు. ధ్వజస్తంభాల వద్ద దీపాలను వెలిగించి ఆరాధించారు.

రేపటి నుంచి సాయిబాబా మందిర్‌ వార్షికోత్సవం

ఏలూరుకార్పొరేషన్‌, మార్చి 1:స్థానిక శనివారపుపేటలోని శ్రీరామ్‌నగర్‌ 11వ రోడ్డులో వున్న షిరిడీ సాయిబాబా మందిర్‌ 23వ వార్షికోత్సవాలు ఈనెల 3, 4 తేదీల్లో జరుగుతాయని మందిరం నిర్వాహకులు తెలిపారు. 3న సాయి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తామని, 4న కాకడ హారతి, బాబావారికి, వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతనామ పూజ జరుపుతామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్‌ పరీక్షలు



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 1 : ఇంటర్‌ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభం కావడంతో పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్‌ శాఖ బందోబస్తును ఏర్పాటు చేసింది. ఎస్పీ మేరీ ప్రశాంతి ఏలూరులోని శ్రీచైతన్య, నారాయణ కాలేజీలలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరే మార్గాల్లో అంతరాయం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. స్పెషల్‌ బ్రాంచ్‌ సీఐ మల్లేశ్వరరావు, త్రీటౌన్‌ సీఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- చింతలపూడి, మార్చి 1 : చింతలపూడిలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 859 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 87 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.
- ఉంగుటూరు, మార్చి 1 : నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో శుక్రవారం ఇంటర్మీడియెట్‌ మొదటి సంవత్సరం పరీక్షకు కళాశాలలో 140 మందికి అనుమతి ఉండగా తొలి రోజు తొమ్మిది మంది గైర్హాజరైనట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ బి.వి.శ్రీనివాస్‌ తెలిపారు.
- కామవరపుకోట, మార్చి 1 : కామవరపుకోటలోని కళాశాలలో తొలిరోజు పరీక్షకు 250 మంది హాజరుకావాల్సి ఉండగా 16 మంది గైర్హాజరయ్యారు.
- లింగపాలెం, మార్చి 1: ధర్మాజీగూడెంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, ప్రతిభా జూనియర్‌ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను ఇంటర్మీడియట్‌ విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రావు తనిఖీ చేశారు. ఇంటర్‌ మొదటి సంవత్సరంలో 303 మందికి 263 మంది హాజరయ్యారని ఇంటర్మీడియట్‌ విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రావు తెలిపారు.
- పోలవరం, మార్చి 1 : పోలవరం మండలంలో ఇంటర్‌ మొదటి సంవత్సరం పరిక్షలు ప్రశాంతంగా జరిగాయని శుక్రవారం ప్రిన్సిపాల్‌ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌ మొదటి సంవత్సర పరీక్షలకు 40 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 36 మంది మాత్రమే హాజరయ్యారని, నలుగురు విద్యార్థులు గైర్హాజరయినట్టు తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి ఏఐటీయూసీ పోరాటం

టి.నరసాపురం, మార్చి 1 : కార్మికుల సంక్షేమం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టీవీఎస్‌ రాజు అన్నారు. మక్కినవారిగూడెంలో ఏఐటీయూసీ కార్యాలయంలో ముఠా వర్కర్స్‌ యూనియన్‌ సమావేశం యూనియన్‌ అధ్యక్షుడు మల్లెల సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో మున్సిపల్‌ కార్మికు లు, అంగన్వాడీ, ఆశ, సంక్షేమ స్కీం వర్కర్లు చేసిన సమ్మెకు ఏఐటీయూసీ అండగా నిలిచి విజయం సాధించిందన్నారు. ఏఐటీయూసీ ఉద్యమ ఫలితంగా కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పడిందన్నారు. జగన్మోహనరెడ్డి సంక్షేమ బోర్డు సొమ్మును దారిమళ్ళించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, యూనియన్‌ కార్యదర్శి కొప్పుల సతీశ్‌, ఉపాధ్యక్షుడు బైగాని ఏకాంబరం, కోశాధికారి మునునూరి కృష్ణ పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దుకు పోస్టుకార్డుల ఉద్యమం



పోస్టుకార్డులను ప్రదర్శిస్తున్న న్యాయవాదులు

భీమడోలు, మార్చి 1:భూహక్కు చట్టం రద్దుకోసం పోస్టుకార్డుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని భీమడోలు బార్‌ అసోసియేషన్‌ పేర్కొంది. భీమడోలు సివిల్‌ కోర్టు ప్రాంగణంలో ఈ సందర్భంగా న్యాయవాదులు విధులు బహిష్కరించి పోస్టుకార్డుల ప్రదర్శనతో నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి రాజారావు, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కాళీ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జీవీ ప్రసాద్‌, మాజీ అధ్యక్షుడు విజయరాజు, న్యాయవాదులు గీతాంజలి, సుధారాణి, రాణి, బాలాజీ, వికాస్‌, రమేష్‌, శశాంక్‌, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత స్కూళ్ల సీట్లకు ప్రభుత్వమే ఫీజు భరించాలి

ఏలూరు ఎడ్యుకేషన్‌, మార్చి 1 : ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లను ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద భర్తీచేసిన ప్రభుత్వం ఆ మేరకు ఫీజుతోసహా పూర్తిఖర్చులను ప్రభుత్వమే భరించాలని రిటైర్డ్‌ డీఈవో, సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఓ ప్రకటనలో డిమాండ్‌ చేశారు. ఫీజు చెల్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులను ఒత్తిడి చేయడం సబబుకాదన్నారు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టంప్రకారం ప్రభుత్వమే ఖర్చులను భరించాల్సి ఉంటుందన్నారు.

'పది' విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి

నిడమర్రు మార్చి 1 : పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ప్రశాంతంగా, మనోధైర్యంగా హాజరయ్యేలా తయారు కావాలని నిడమర్రు ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. శుక్రవారం పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలో పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పలు సబ్జెక్టు నిపుణులు పరీక్షల సన్నద్ధతతో పాటించాల్సిన మెలకువలను తెలిపారు. ఉత్తమ మార్కుల సాధన కోసం ఏవిధంగా ప్రిపరేషన్‌ పూర్తిచేయాలో సూచించారు. పాఠశాల హెచ్‌ఎం టి.వి. సత్యనారాయణ, ఉపాధ్యాయులు టి.గోపాలకృష్ణ, భీమేష్‌, జాకబ్‌రాజు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు ఎడ్యుకేషన్‌, మార్చి 1:అంటువ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్‌ మలేరియా అధికారి జె.గోవిందరావు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత-అంటువ్యాధుల నిర్మూలన అంశంపై శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక తంగెళ్ళమూడి, ఎంఆర్‌సీ కాలనీ, కబడ్డీగూడెం అర్బన్‌ పీహెచ్‌సీల పరిధిలో ప్రజలకు ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది రెహమున్నీసా బేగం, నాంచారమ్మ, ఉమ, శిరీష, పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్‌ త్వరితగతిన పూర్తి చేయాలి

ఉంగుటూరు, మార్చి 1 : నవరత్నాల పథకాలలో భాగంగా జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్‌ త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్‌ వెంకట శేషయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్‌ల కోసం తిరుగుతున్న సమయంలో గల్ఫ్‌ దేశాలలోను, గ్రామాంతరాలలోను ఉన్న వారి నుంచి స్పందన రావడం లేదని తెలుస్తోంది. దీనిపై వీఆర్‌వోలతో విచారణ జరిపి త్వరితగతిన రిజిస్ట్రేషన్‌ చేయాలన్నారు. అనంతరం ఎన్నికలపై సమీక్ష జరిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్‌ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్‌, ఎన్నికల డీటీ పోతురాజు, ఆర్‌ఐ.సాయి రమేష్‌, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో సోషల్‌ ఆడిట్‌

ఉంగుటూరు, మార్చి 1 : మండలంలోని వ్యవసాయ శాఖలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఈ-క్రాపింగ్‌పై సోషల్‌ ఆడిట్‌ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో జాబితాను ప్రదర్శిస్తున్నారు. మండలంలో 9739మంది రైతులు ఉండగా క్రాప్‌ బుకింగ్‌ 24,453 ఎకరాలలో పంట నమోదు చేయించుకున్నారని ఏవో బాలిన వెంకటేశ్‌ తెలిపారు. వరి పంటకై 22,524 ఎకరాలలోనూ, 202 ఎకరాలలో పొగాకు, చెరకు 22 ఎకరాలలో ఈ-క్రాపింగ్‌ను రైతులు చేయించుకున్నారన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు వంటసామగ్రి అందజేత

బుట్టాయగూడెం, మార్చి 1:మంచులవారిగూడెం గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కేరం వెంకటేశ్వరావు, బుజ్జమ్మ దంపతులకు తక్షణ సాయంగా తపన ఫౌండేషన్‌ అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఫౌండేషన్‌ ప్రతినిధులు వంటసామగ్రిని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మొడియం శ్రీనివాసరావు, వంకా కాంచనమాల, దొమ్మేటి లక్ష్మీజనార్దనరావు, దెయ్యాల సీతారామాంజనేయులు, సోము హరినారాయణ, పావిల వీరకృష్ణ, సోర్ల పుణ్యలక్ష్మి, కొండేపాటి రామకృష్ణ, తపన ప్రతినిధులు తాటి వెంకటరమణ, మడకం ప్రదీప్‌ పాల్గొన్నారు.

మర్రిగూడెంలో బాధితులకు ఆర్థిక సాయం

టి.నరసాపురం, మార్చి 1:మర్రిగూడెం గ్రామంలో కురసం వెంకటేశ్వరరావు తాటాకిళ్లు గురువారం షార్ట్‌ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధం కావడంతో నిరాశ్రయులైన బాధిత కుటుంబాన్ని జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు శుక్రవారం పరామర్శించారు. రూ.5వేలు ఆర్థిక సాయంతో పాటు ఇంటి సామగ్రి, వంట పాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు సమాచారం అందించి ప్రభుత్వం ద్వారా ఇళ్లు మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. ఎంపీపీ దారబోయిన లక్ష్మీవెంకటేశ్వరరావు, సర్పంచ్‌ సోయం బిందు, వైసీపీ ఎస్టీ సెల్‌ రాష్ట్ర కార్యదర్శి కురసం నిరీక్షణరావు పాల్గొన్నారు.



మావుళ్లమ్మకు బంగారు హారం



భీమవరంటౌన్, మార్చి 1 : హైదరాబాద్‌కు చెందిన దంపతులు ఇందుకూరి సోమరాజు, విజయకుమారి మావుళ్లమ్మకు 20 గ్రాముల బంగారు నల్ల పూసల దండ, పట్టుచీర బహూకరించారు. శుక్రవారం దాతలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకుడు కొడమంచిలి కొప్పేశ్వరరావు, దేవస్థానం తరపున ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మి, నగేష్ శేషవస్త్రం అమ్మవారి ఫొటో, ప్రసాదం అందజేశారు.

జబర్దస్త్ టీమ్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డు



ఏలూరు టూ టౌన్, మార్చి 1: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి తరపున కమల రథం కార్యక్రమంలో జబర్దస్త్ కళాకారులు సినీ గాయకుల బృందం 25 రోజుల్లో 100కుపైగా ప్రదర్శ నలతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు. తపనా చౌదరి మాట్లాడుతూ రాజకీయ పార్టీ తరపున తక్కువ కాలంలో ఎక్కువ ప్రదర్శనలు నిర్వహించి రికార్డు సాధించటం దేశంలోనే మొదటిసారి అన్నారు. శుక్రవారం సుంకరవారి తోట ప్రదర్శనను ఇండియా బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు పరిశీలించి, రికార్డు నమోదు చేశారు. కళాకారులకు మెడల్స్ అందజేశారు. సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, అదిరే అభి, సినిమా ఫేమ్ రమణ, రఘు, న్యాయవాది వరప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష .. విద్యార్థులకు శిక్ష

పోలవరం, మార్చి 1 : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విద్యార్థులకు శిక్షగా మారింది. శుక్రవారం వైసీపీ నాయకులు పోలవరం మండలంలో నిర్వహించిన పలు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా పోలవరం పంచాయతీ కొత్తరామయ్యపేట పునరావాస కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణ కోసం విద్యార్థులను, అంగన్వాడీ శిశువులను బయటకు పంపి పాఠశాలలో ఆరోగ్య సురక్ష నిర్వహించారు. పాఠశాలకు సెలవు ప్రకటించి విద్యార్థులను ఇళ్లకు పంపడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల విద్యాశాఖాధికారి సురేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష గురించి సెలవు ప్రకటించామని ఆదివారం క్లాసులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీంతో వైసీపీ ప్రచార హంగుల కోసం విద్యార్థులకు సెలవు ప్రకటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మహిళలు రాణించాలి : గాయని సునీత



చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభిస్తున్న సునీత

ఉంగుటూరు,మార్చి 1: 'సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకం. వారు అన్ని రంగాలలో రాణించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యం అవుతుంది' అని ప్రముఖ గాయని సునీత ఉపద్రష్ట పేర్కొన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం చేబ్రోలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సునీతను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. పేద మహిళలకు చీరలు, పిల్లలకు చెప్పులు, పలకలు పంపిణీ చేశారు. సునీత దైవభక్తి గీతాలు, సంప్రదాయ పాటలతో అలరించారు. గొట్టుముక్కల విజయలక్ష్మి, హ్యాండీక్రాఫ్ట్ కేంద్ర ప్రభుత్వ ప్రమోషన్ అధికారి ఎం.సువర్చల పాల్గొన్నారు.

ఎన్నికల విధులలో సమష్టిగా పని చేయాలి : ఎస్పీ

భీమవరం క్రైమ్, మార్చి 1 : సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశించారు. భీమవరం, నర్సాపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలింగ్ బూత్‌లను ముందుగా తనిఖీ చేయాలని సరిహద్దులలో నిత్యం వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలని ఆమె ఆదేశించారు. రౌడీ షీటర్ల బైండోవర్‌లు, పెండింగ్ కేసులలో ముద్దాయిలను కోర్టుకు హాజరు పరచాలన్నారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. ముందస్తు చర్యలు, సీఆర్‌పీసీ 107 నుంచి 110 వరకూ సెక్షన్‌ల కింద ఎన్నికల సమయంలో అల్లర్లు, సమస్యలు సృష్టించే వారిని గుర్తించాలని పాత నేరస్తులను బైండోవర్ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

బల్లిపాడు విద్యార్థుల ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపిక

అత్తిలి, మార్చి 1 : అత్తిలి మండలం బల్లిపాడు ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్టు హెచ్ఎం వై.దత్తు తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు కె.రాము, వి.సాయి, బాలాజీ, పి.మహేష్, కె.చరణ్ ఉపాధ్యాయులు ఎస్‌కే మల్లేశ్వరరావు, డీఎంజీ ప్రసాద్ సహకారంతో సోలార్ ప్యానల్ క్లీనర్ నమూనాను ప్రదర్శించినట్లు తెలిపారు. డీఈవో ఆర్.వెంకటరమణ విద్యార్థులకు జ్ఞాపికను, అభినందన పత్రం అందజేశారని తెలిపారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను హెచ్ఎం దత్తు అభినందించారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిట్ ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 1: భారతదేశం విభిన్న భాషలకు పుట్టినిల్లని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్ ప్రాంగణంలో శుక్రవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, భాష ఒక జాతి ప్రజల అస్తిత్వానికి చిహ్నమని, ప్రతీ భాషకు ప్రత్యేక శైలి, విశిష్టత ఉంటాయన్నారు. మాతృభాష తల్లిలాంటిదని, ప్రజల వ్యక్తిత్వానికి తోడ్పడుతుందన్నారు. మాతృభాషతోపాటు ఇతర భాషలను ఆదరించాలన్నారు. డీన్‌లు డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, డాక్టర్ ఎస్.జయరాంలు మాట్లాడుతూ తెలుగు భాష సౌందర్యం, మాధుర్యం ఎంతో గొప్పవన్నారు. విద్యార్థుల చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

స్టేషనరీ సరఫరాకు టెండర్లు

భీమవరం టౌన్, మార్చి 1 : సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలోని పశ్చిమ గోదావరి జిల్లాలోని 1,754 పోలింగ్ స్టేషన్‌లకు స్టేషనరీ సరఫరాకు ఆసక్తి గల ఏజెన్సీల నుంచి స్వల్ప వ్యవధి షీల్డ్ టెండర్లను కోరుతున్నట్టు కలెక్టర్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఈ నెల 2 నుంచి 7 వరకు కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్‌లో టెండర్ ఫారమ్‌లను పొందాలని తెలిపారు. టెండర్లను 7లోగా కార్యాలయంలోని టెండర్ బాక్సులో వేయాలన్నారు. ఆదేరోజు టెండర్లు తెరిచి, ఖరారు చేస్తామన్నారు.



పట్టిసీమ ఆలయం, స్వామి వారు

జై వీరేశ్వరస్వామి

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల విశిష్టత

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలు ప్రతిఏటా ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ గ్రామంలో గోదావరి నది మధ్యలోని దేవకూట పర్వతంపై ఉన్న భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో జరుగుతాయి. పంచ క్షేత్రాల్లో ఒక్కటిగా పేరుగాంచిన ఈ శివక్షేత్రానికి రాష్ట్రంలో నలుమూలల నుంచి సుమారు ఐదు లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తుంటారు. ఆలయ విశేషాలు, ఉత్సవ ఏర్పాట్లు, స్థల పురాణంపై ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం ఓ ప్రత్యేక కథనం.

- పోలవరం

ప్రతి ఏటా మార్చిలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఉత్సవ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తూ దేవదాయ, పోలీస్ శాఖ ఇతర సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. పట్టిసీమ ఫెర్రీ రేవు నుంచి గోదావరి నదిని భక్తులు దాటేందుకు గతంలో లాంచీలు వినియోగించేవారు. గోదావరి రేవులు అనుకూలంగా లేకపోవడంతో గత ఐదేళ్లనుంచి గోదావరి నదిపై పంట్లను వారధిలా నిర్మించి భక్తుల రాకపోకలు కొనసాగిస్తున్నారు. అక్కడి నుంచి ఇసుక తిన్నెల్లో భక్తులు సౌకర్యవంతంగా నడిచేలా ఇసుక తిన్నెల్లో గోనె సంచుల్లో ఇసుక నింపి నడక మార్గం ఏర్పాటు, భక్తులు సేదతీరేందుకు చలువ పందిళ్ళు, మంచినీటి అవసరాలకు చేతి పంపులు, చలువ పందిళ్ళలో వాటర్ పాకెట్ల బస్తాలు ఏర్పాటు, పుణ్య స్నానాలకు గోదావరి నది ఒడ్డున బారికేడ్లు తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు నదిలో పడిన వారిని రక్షించేందుకు గజ ఈతగాళ్ళను, స్పీడ్ బోట్లను, ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్ బందోబస్తు, అత్యవసర వైద్యాల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. ఆలయ ప్రాంగణంతో పాటు ఇసుక తిన్నెల్లో విద్యుత్ దీపాలంకరణలు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో చాలా చోట్ల భక్తులకు ఉచిత అన్నదాన, మజ్జిగ, మంచినీటి ఏర్పాట్లను పలు గ్రామాల వారు అందిస్తున్నారు.

స్థల పురాణం ఇలా..

పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం గోదావరి నది మధ్యలో దేవకూట పర్వతంపై వెలసింది. పూర్వం పర్వతాలు రెక్కలతో ఆకాశంలో సంచరించేవని వాటికి అలసట కలిగినప్పుడు భూతలంపై దిగేవని భూమిపై పర్వతాలు దిగే సందర్భంలో జీవరాసులు వాటి కిందపడి ప్రాణాపాయం కలిగేదని జీవరాశి ఇంద్రుడిని వేడుకోగా తన వజ్రాయుధంతో పర్వతాల రెక్కలు ఖండించడంతో ఎక్కడివక్కడే పడిపోయాయని చెబుతారు. ఆ సందర్భంలో పూర్వం కైలాస పర్వతం చేత సాక్షాత్తూ పరమేశ్వరుడ్ని మోస్తున్న దేవకూట పర్వతం పట్టిసీమలో ఇంద్రుడి వజ్రాయుధ ఘాతంతో పడి శివుడ్ని ప్రార్థించడంతో శివుడు దేవకూట పర్వతంపై స్వయంభువుగా వెలుస్తానని మాట ఇచ్చిన ప్రకారం వెలసినట్టు చెబుతారు. ఇక క్షేత్ర పురాణంలో ప్రధాన ఘట్టం దక్షయజ్ఞం మహాశివుడిని శచీదేవి పెళ్ళాడడం ఇష్టంలేని శచీదేవి తండ్రి దక్షప్రజాపతి నిరీశ్వర యాగం చేస్తూ దేవతలందరినీ యాగానికి ఆహ్వానించి పరమేశ్వరుడ్ని ఆహ్వానించకపోవడం, తన తండ్రి చేస్తున్న యాగానికి తాను వెళతానని శివునితో శచీదేవి అనడంతో ఆహ్వానం లేని పేరంటానికి వెళ్ళకూడదని శివుడు వారించినా యాగానికి వెళుతుంది. ఆ యాగంలో శివుడిని హేళనగా మాట్లాడడంతో భంగపడిన శచీదేవి తన కాలివేలితో నేలపై గీసి యోగాగ్ని సృష్టించి అందులో దూకి ఆత్మాహుతి చేసుకుంటుంది. అది నందీశుడి ద్వారా తెలుసుకున్న మహాశివుడు ప్రళయకాళ రుద్రుడై తాండవం చేసి తన జటాజూటాల్లోంచి వీరభద్రుడ్ని సృష్టించి పట్టసమనే ఆయుధాన్నిచ్చి దక్షుడి తల నరికి తెమ్మంటాడు. వీరభద్రుడు దక్షుడి తల తెచ్చి ఇచ్చి పట్టసమనే ఆయుధాన్ని జారవిడుస్తాడు. ఆ ఆయుధం దేవకూటంపై పడ్డ ప్రాంతం పట్టసంగా గతంలో పిలవబడి కాలక్రమేణా పట్టిసీమగా మారింది.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని దుర్మరణం



పెదవేగి, మార్చి 1 : స్నేహితునితో కలిసి ద్విచక్ర వాహనంపై కళాశాలకు వెళ్తున్న విద్యార్థినిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటనలో విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందగా, స్నేహితుడు గాయాలపాలయ్యాడు. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాలివి.. బి.సింగవరానికి చెందిన పలగాని లక్ష్మణ్, రాట్నాలమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తెకు వివాహం అవ్వగా చిన్న కుమార్తె లావణ్య ఏలూరు ఎస్ఆర్ఐ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం స్నేహితుడు కట్టా వెంకటేశ్వరరావుతో కలిసి బి.సింగవరం నుంచి కళాశాలకు బయలుదేరింది. మధ్యాహ్నం 12.30 గంటలకు వంగూరు సమీపంలో రంగరాజు గోడౌన్స్ దగ్గర లారీ వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో లావణ్య(19) అక్కడికక్కడే మృతి చెందింది. స్నేహితుడు వెంకటేశ్వరరావు గాయాలతో ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

కడుపునొప్పి తాళలేక ఇద్దరి ఆత్మహత్య

పెదవేగి, మార్చి 1 : కడుపు నొప్పితో తాళలేక బాలిక ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాలి.. కొండలరావుపాలేనికి చెందిన కఠాని సుబ్బలక్ష్మి పదో తరగతి చదువుతోంది. ఆ బాలికకు కొంత కాలంగా కడుపునొప్పితో బాధ పడుతోంది. గత నెల 28న కడుపు నొప్పి తీవ్రమవడంతో ఎలుకల మందును నీళ్లలో కలుపుకుని తాగేసింది. గమనించిన తల్లిదండ్రులు ఏలూరు సర్వ జన ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించింది. మృతదేహానికి శవ పరీక్ష చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

టి.నరసాపురం: కడుపు నొప్పి తాళలేక ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. వెలగపాడుకు చెందిన గుడిదల చిన్న గురవయ్య కడుపు నొప్పిని తట్టుకోలేక ఫిబ్రవరి 29న పురుగుల మందు తాగాడు. వెంటనే జంగారెడ్డిగూడెం నిర్మల ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుమారుడు గుడదల భీమయ్య ఫిర్యాదుతో ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఏలూరు క్రైం, మార్చి 1 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న శుక్రవారం మృతి చెందాడు. ఏలూరు సమీపంలోని సత్రంపాడులో ఒక చికెన్ షాపులో నిమ్మల మధు (22) పనిచేస్తున్నారు. గత నెల 26న మధు, పెద్దమ్మ కుమారుడు నిమ్మల ఏసు కలిసి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన మధును విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఏలూరు త్రి టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత.. ముగ్గురుపై కేసు



పోలీసుల అదుపులో నిందితులు

ముసునూరు, మార్చి 1: ఏలూ రు నుంచి గంజాయిని రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులపై ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం సాయంత్రం ఏలూరు నుంచి నూజివీడుకు ముగ్గురు నిందితులు బైక్‌పై గంజాయి రవాణా చేస్తుండగా చిల్లబోయినపల్లి కాజ్‌వే దాటిన తర్వాత కొప్పాక వెళ్ళే రహదారిలో దాడి చేసినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు కేజీల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు నూజివీడు పట్టణానికి చెందిన వారని, వీరు గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నూజివీడు టౌన్ సీఐ మూర్తి తదుపరి విచారణ చేయనున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు.

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై విచారణ



విచారణ చేస్తున్న పీడీఎస్‌యు నాయకులు

జంగారెడ్డిగూడెం, మార్చి 1 : జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు శ్రీహరిబాబు విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించాడని శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు లోవకుమారి, మండల విద్యాశాఖ అధికారి బి.రాములు విచారణ చేపట్టారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు భూషణం మాట్లాడుతూ విద్యార్థినులపై దుస్తుల కొలతల పేరుతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై కఠినచర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని మాట్లాడుతూ ఘటనపై విద్యాశాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి తగు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. స్కౌట్ విద్యార్థినులకు యూనిఫామ్ దుస్తులకు అనుమతి లేకుండా ఉపాధ్యాయుడు రూ.750 వసూలు అసభ్యకరంగా ప్రవర్తించడం దుర్మార్గపు చర్యలన్నారు. బి.వినోద్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

నిడమర్రు మార్చి 1 : నిడమర్రుకు చెందిన ఓ యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. 19 ఏళ్ల యువతి బుధవారం నుంచి కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించి తండ్రి తమకు ఫిర్యాదు చేశారని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలో కొందరి యువకులపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఉండి, మార్చి 1: పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాలివి.. ఉణుదుర్రులో పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని, రూ.13 వేల 170 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చెరుకువాడలో బంగారు వస్తువుల అపహరణ

ఉండి, మార్చి 1: శ్రీచెన్నమల్లేశ్వరస్వామివారి ఆలయ ప్రతిష్టాపన పూజలకు వెళ్లిన ఇరువురి మహిళల బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండి మండలం చెరుకువాడలో గతనెల 29న శ్రీచెన్నమల్లేశ్వర స్వామి ఆలయ విగ్రహ పునఃప్రతిష్టా కార్యక్రమాలు, హోమాలు, పూజలు చేయడానికి వెళ్లిన ముదునూరి సరస్వతికి చెంది న రెండు కాసుల బంగారు సూత్రాలు, పెన్మెత్స శిరీషాకు చెందిన రెండున్నర కాసుల బంగారు పసుపు తాడు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

డిప్యూటీ వార్డెన్ నవీన్‌కుమార్ సస్పెన్షన్

బుట్టాయగూడెం, మార్చి 1: గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 19న 40 మంది విద్యార్థుల అస్వస్థతకు బాధ్యులైన డిప్యూటీ వార్డెన్ కె.నవీన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ కేఆర్ పురం ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు జి.రాజుకు నోటీసు జారీ చేసి విచారణ అధికారిని నియమించామన్నారు. జీలుగుమిల్లి ఏటీడబ్ల్యూవో కె.కృష్ణమోహన్ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల పర్యవేక్షణలో నిర్లక్ష్యంపై క్రమశిక్షణ చర్యలకు గిరిజన సంక్షేమశాఖ సంచాలకులకు సిఫార్సు చేశామన్నారు. ఆహార పదార్థాల నాణ్యతపై టెండరుదారునికి నోటీసులు ఇచ్చామని పీవో తెలిపారు.

అప్పుచేసి వండి పెడుతున్నాం

గ్యాస్ లేక కట్టెలపొయ్యి మీదే వంట.. భోజన ఏజన్సీల గగ్గోలు



ఆగిరిపల్లి, మార్చి 1: సకాలంలో బిల్లులు రాక పాఠశాలల ఫుడ్ ఏజన్సీ వర్కర్లు ఆందోళన పడుతున్నారు. ఆగిరిపల్లి మండలంలో జడ్పీ హెచ్ స్కూల్, మండల ప్రాథమిక పాఠశాలలకు చెందిన వర్కర్లు నాలుగు నెలల నుంచి బిల్స్ రాలేదని గగ్గోలు పెడుతున్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల వంట ఏజెన్సీలకు సొమ్మురాకపోవడంతో తాము బయట అప్పు తెచ్చి వంటలు చేస్తున్నామని, పిల్లల కడుపు మాడ్చటం తమకు ఇష్టం లేక ఈ విధంగా అప్పు తెచ్చి వంట చేస్తున్నామని, తమ గోడు ప్రభుత్వం అర్థం చేసుకోవాలని ఏజన్సీ నిర్వాహకురాలు నాగరత్నం తెలిపారు. కనీసం వంట చేయటానికి గ్యాస్ కూడా లేక కట్టెల పొయ్యి మీద చేస్తున్నామని తెలిపారు. ఈ విషయం ఎంఈవో కొవ్వలి ఆనంద్‌కుమార్‌ను సంప్రదించగా మార్చి నెలాఖరులోపు డబ్బులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

పింఛన్ డబ్బులు కాజేత

వ్యక్తి పరార్.. వృద్ధులు లబోదిబో



సొమ్ములు పోగొట్టుకున్న వృద్ధులు

తణుకు, మార్చి 1: వృద్ధులకు ప్రభుత్వం ఇచ్చిన పింఛన్ డబ్బులు రూ.9 వేలను గుర్తు తెలియని దుండగుడు కాజేసి పరారయ్యాడు. ఈ ఘటనపై వారు శుక్రవారం తణుకు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండేపూడి పద్మ, మండేపూడి సూర్యకాంతం బ్యాంకు కాలనీలోను, వెంకట్రాయపురం 17వ వార్డుకు చెందిన గొల్లి సావిత్రిలకు వలంటీర్లు మూడు వేలు చొప్పున పింఛన్లు అందజేశారు. శుక్రవారం గుర్తు తెలియని దుండగుడు వారి వద్దకు వెళ్లి తానొక ఉన్నతోద్యోగినని, కలెక్టర్ గారు పంపించారని పరిచయం చేసుకొని మీకు ఇల్లు కట్టుకోవడానికి రూ.4 లక్షలు మంజూరయ్యాయని ఆధార్‌కార్డు జిరాక్సులు తీసుకొని సచివాలయానికి రమ్మన్నాడు. మీకు పింఛను రూ.6 వేలకు పెంచారని, రూ.3 వేలు ఇవ్వడమేమిటని, అడుగుతానని చెప్పి మీ వద్ద ఉన్న రూ.9 వేలు ఇవ్వమని, ఆఫీసుకి వెళ్లి మాట్లాడి మీకు రూ.18 వేలు తెచ్చి ఇస్తానని నమ్మించాడు. వృద్ధులు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని వచ్చేలోపు దుండగుడు పరారయ్యాడు. విషయాన్ని సచివాలయంలో చెప్పగా పక్కన ఉన్న ప్రగతి కాలేజీలో సీసీ కెమేరా ఫుటేజీ చూసినా ఆచూకీ లభించలేదు. దీంతో వృద్ధులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూమిని ఇప్పించండి : వృద్ధురాలి ఆందోళన

మొగల్తూరు, మార్చి 1 : తన డి నమూనా భూమిని రెవెన్యూ అధికారులు మరొకరి పేరున బదిలీ చేశారని, పేరుపాలెంలో వృద్ధురాలు ఆందోళన చెందారు. వివరాల్లోకి వెళితే కొల్లాటి జయలక్ష్మి పేరుపాలెం సౌత్ పంచాయతి మోళ్లపర్రులో 779/3లో య.2.5 ఎకరాల డి నమూనా భూమిని కొనుగోలు చేశామన్నారు. 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారని ఆ భూమిని సాగు చేసుకొని జీవిస్తున్నామన్నారు. ఆ భూమిని తమకు తెలియకుండా రుద్రరాజు కృష్ణవేణి భర్త సత్యనారాయణరాజు పేరిట రెవెన్యూ అధికారులు జనవరిలో బదలాయించి మీ భూమి వెబ్ సైట్‌లో ఆమె పేరున మార్చడంతో వృద్ధురాలు లబోదిబోమంటున్నారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, రెవెన్యూ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్టు ఆమె శుక్రవారం మొగల్తూరులో విలేకరులకు తెలిపారు. మొగల్తూరులో జనవరి, ఫిబ్రవరిలో డి నమూనా పట్టాల మార్పు, ఆన్‌లైన్ రికార్డుల్లో మార్చిన వైనంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్టు బాధితులు పేర్కొన్నారు.

జీసీసీలో 30 టన్నుల బియ్యం పక్కదారి



కుక్కునూరు, మార్చి 1 : కుక్కునూరు, వేలేరుపాడు మం డలాల్లోని రేషన్ దుకాణాలకు సరఫరా చేయాల్సిన బియ్యం పక్కదారి పట్టాయి. దాదాపు 30 టన్నుల బియ్యం మాయమైనట్టు సమాచారం. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు సంబంధించి పీడీఎఫ్ బియ్యం నిల్వలు కుక్కు నూరులోని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) గోడౌన్‌తో పాటు గోదావరి వరదలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలం నారాయణపురంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని రెండు చోట్ల బియ్యాన్ని నిల్వ చేశారు. ఇటీవల విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి దీనిపై ఉన్నతాధి కారులకు సమాచారం అందించారు. రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేసే సమయంలో పర్యవేక్షణ లోపంతో బియ్యాన్ని ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై సివిల్ సప్లయిస్ డీఎం మంజుభార్గవిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. 'బియ్యం పక్కదారి పట్టింది వాస్తవమే. ఇప్పటికే విజిలెన్స్ అధికారులు తనిఖీలు జరపగా 30 టన్నుల బియ్యం వ్యత్యాసం వచ్చినట్టు గుర్తించాం. అందుకు కారకులైన వారిపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

టీడీపీ వీరాభిమాని గుండెపోటుతో మృతి

టీడీపీ వీరాభిమాని గుండెపోటుతో మృతి
కుటుంబానికి మూడు లక్షల సాయం



చెక్కును అందజేస్తున్న రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం, మార్చి 1 : గుండెపోటుతో మరణించిన బాధిత కుటుంబాన్ని ఎన్టీఆర్ ట్రస్టు ఆదుకుంది. జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటలో టీడీపీ చంద్రబాబు అక్రమ అరెస్టును విని గుండెపోటుతో మరణించిన టీడీపీ వీరాభిమాని భీమడోలు వెంకయ్య కుటుంబానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రూ.3 లక్షల చెక్కును వారి కుమా రులు భీమడోలు రమేష్, భీమడోలు రాంబాబులకు చింతలపూడి నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్ శుక్రవారం అందజేశారు. పేరంపేటలో నిర్మాణంలో ఉన్న సీఎస్ఐ చర్చికి సొంగ రోషన్‌కుమార్ రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును జైల్లో పెట్టిన సమయంలో మనోవేదనతో మృతి చెందిన వీరాభిమానుల కుటుంబా లను భువనేశ్వరి పరామర్శించి బాధిత కుటుంబాలను ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. నాయకులు సాయిల సత్యనారాయణ, మాధవరావు, గోలి అనిల్, గోలి రామకృష్ణారెడ్డి, గోలి సత్తిరెడ్డి, సర్పంచ్ కంకిపాటి కుమారి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు నిత్యావసరాల పంపిణీ

నరసాపురం రూరల్, మార్చి 1: తూర్పుతాళ్లలో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ సర్క్యూట్‌తో ఆకుల సత్యనారాయణ తాటాకిల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటికి వచ్చి ప్రాణాలను రక్షించుకున్నారు. బాధిత కుటుంబాన్ని చీఫ్ విప్ ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడులు పరామర్శించారు. పక్కా ఇల్లు నిర్మిస్తామని, ముదునూరి హామీతోపాటు నిత్యావసర వస్తువులు అందించారు. బాధితులను ఆదుకుంటామని బండారు భరోసా ఇచ్చారు.

అప్పుచేసి వండి పెడుతున్నాం..

- గ్యాస్ లేక కట్టెల పొయ్యి మీదే వంట
- భోజన ఏజెన్సీల గగ్గోలు
- బిల్లులు మంజూరు చేయాలని వినతి


మాట్లాడుతున్న నాగరత్నం

ఆగిరిపల్లి, మార్చి 1: సకాలంలో బిల్లులు రాక పాఠశాలల ఫుడ్ ఏజెన్సీ వర్కర్లు ఆందోళన చెందుతున్నారు. ఆగిరిపల్లి మండలంలో జడ్పీహెచ్ స్కూల్, మండల ప్రాథమిక పాఠశాలలకు చెందిన వర్కర్లు సుమారు నాలుగు నెలల నుంచి బిల్స్ రాలేదని గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల వంట ఏజెన్సీలకు సొమ్ము రాకపోవడంతో తాము బయట అప్పు తెచ్చి వంటలు చేస్తున్నామని, పిల్లల కడుపు మాడ్చటం తమకు ఇష్టంలేక ఈ విధంగా అప్పుతెచ్చి వంట చేస్తున్నామని, తమ గోడు ప్రభుత్వం అర్థం చేసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకురాలు నాగరత్నం తెలిపారు. కనీసం వంట చేయటానికి గ్యాస్ కూడా లేక కట్టెల పొయ్యి మీద చేస్తున్నామని తెలిపారు.


కట్టెలపొయ్యిపై వంట

ఎంఈవో ఏమన్నారు?

ఈ విషయం ఎంఈవో కొవ్వలి ఆనంద్‌కుమార్‌ను సంప్రదించగా మార్చి నెలాఖరులోపు డబ్బులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.


భోగేశ్వర స్వామి ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ ప్రశాంతి

ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు : ఎస్పీ

కలిదిండి, మార్చి 1 : కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. శుక్రవారం భోగేశ్వరుడి ఆలయాన్ని సందర్శించి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్సవాలకు విచ్చేసే భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ఆలయ ప్రధాన రహదారిపై వాహనాలు స్తంభించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కోనేరులో స్నానాలు చేసే భక్తులు ప్రమాదాల బారిన పడకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ పాయింట్స్, షిఫ్టుల వారిగా ఏర్పాటు చేయాల్సిన బందోబస్తు, పోలీసు కంట్రోల్ రూమ్ తదితర వాటిపై డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, సీఐ కృష్ణకుమార్, ఎస్‌ఐ ప్రియకుమార్‌కు పలు సూచనలు చేశారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కోనేరు స్నానాల ఘాట్ వద్ద మహిళలకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ వడుపు రామారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును దుర్వినియోగం చేయకండి



ఆగిరిపల్లి, మార్చి 1: ప్రజల ఓటు హక్కును దుర్వినియోగం చేయవద్దని ఎంపీపీ శామ్యూల్ తెలిపారు. ఆగిరిపల్లిలో శుక్రవారం జరిగిన అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ డబ్బుకు ఆశపడి ఓటు అమ్ముకోరాదని అలాచేస్తే మన బిడ్డల భవిష్యత్ మనమే కాలరాసినట్లు అవుతుందని ఈవోపీఆర్డీ శేఖర్ అన్నారు. పంచాయతీ ఈవో బొల్లినేని ప్రసాద్ పాల్గొన్నారు.

మండవల్లిలో ర్యాలీ..

మండవల్లి: మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు వినియోగిం చుకోవాలని నినాదాలు చేశారు. మండవల్లి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్, సెక్రటరీ శ్రీనివాసరావు, వీఆర్వో నాగూర్, బీఎల్వో శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

షర్మిలను కలసిన పీసీసీ సభ్యుడు మంగినేని



ముదినేపల్లి, మార్చి 1 : రానున్న ఎన్నికల్లో కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరఫున తనకు అవకాశం కల్పించాలని పీసీసీ సభ్యుడు, ముదినేపల్లి మండలానికి చెందిన మంగినేని బాబ్జీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కోరారు. ఆమెను విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో గురువారం కలసి ఈ మేరకు దరఖాస్తు అందజేశారు. తాను గత 20 ఏళ్లుగా నియోజకవర్గంలో పార్టీకి చేసిన సేవలు, నిర్వహించిన పదవులను పేర్కొంటూ ఆమెకు బయోడేటాను సమర్పించారు.

క్రైం కార్నర్

గంజాయి పట్టివేత


పోలీసుల అదుపులో నిందితులు

ముసునూరు, మార్చి 1: ఏలూరు నుంచి గంజాయిని రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులపై ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం సాయంత్రం ఏలూరు నుంచి నూజివీడుకు ముగ్గురు నిందితులు బైక్‌పై గంజాయి రవాణా చేస్తుండగా చిల్లబోయినపల్లి కాజ్‌వే దాటిన తర్వాత కొప్పాక వెళ్ళే రహదారిలో దాడి చేసినట్లు ఎస్‌ఐ పి.వాసు తెలిపారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు కేజీల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు నూజివీడు పట్టణానికి చెందిన వారని, వీరు గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి విక్రయి స్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నూజివీడు టౌన్ సీఐ మూర్తి విచారణ చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



కైకలూరు ప్రభుత్వ కళాశాల వద్ద విద్యార్థుల హాల్ టిక్కెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది.. ముదినేపల్లిలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

తొలిరోజు ప్రశాంతం

- ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు
- నేటి నుంచి సెకండియర్ పరీక్షలు

కైకలూరు, మార్చి 1: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కైకలూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ దత్తాత్రేయ కోఆపరేటివ్ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 516 మంది హాజరు కావల్సి ఉండగా 40 మంది గైర్హాజరయ్యారు. మిగిలిన 476 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఆయా కళాశాలల సిబ్బంది తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 265 మందికి గాను 248 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారు. అలాగే దత్తాత్రేయ జూనియర్ కో-ఆపరేటివ్ కళాశాలలో 251 మందికి 23 మంది గైర్హాజయ్యారు. ఆయా కళాశాలల వద్ద 144వ సెక్షన్ అమలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద మంచినీరు, వైద్యసిబ్బందిని ఏర్పాటు చేశారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 129 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 122 మంది హాజరయ్యారు. ప్రైవేట్ కళాశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి, డిపార్ట్‌మెంటల్ అధికారి నాగేశ్వరరావు పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు. ఎస్‌ఐ డి.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నేటి నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు..

శనివారం నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వివిధ కళాశాలలకు చెందిన 220 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ మూర్తి తెలిపారు.

కలిదిండి: మండలంలో కలిదిండి, కోరుకొల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 94 మందికి 85 మంది, కోరుకొల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 41 మందికి గాను 33 మంది విద్యార్థులు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్‌లు ఎన్.గోపాలకృష్ణంరాజు, శాంసన్ రాజు తెలిపారు.

నూజివీడులో..

నూజివీడు టౌన్: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు నూజివీడులో ప్రశాంతంగా జరిగాయి. నూజివీడు పట్టణంలో మొత్తం 5 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. నూజివీడు మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 411 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా, 29 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వాగ్దేవి జూనియర్ కళాశాలలో 325 మందికి 11 మంది, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో 271 మంది విద్యార్థులకు గాను 13 మంది, శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 254 మందికి 14 మంది, శ్రీ శారద జూనియర్ కళాశాలలో 360 మందికి 10 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. మొత్తం ఐదు పరీక్షా కేంద్రాల్లో 1621 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 77మంది గైర్హాజరయ్యారు.



కైకలూరు పట్టణం, మండవల్లి మండలం పులపర్రులలో సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్ల పంపిణీ చేస్తున్న దృశ్యం

పేదలకు వరం సూపర్ సిక్స్ పథకాలు

కైకలూరు, మార్చి 1: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు పేదల పాలిట వరమని మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు అన్నారు. శుక్రవారం కైకలూరు పట్టణంలోని 19వ బూత్‌లో పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి సూపర్ 6 పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ టీడీపీ-జనసేన పార్టీల ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన సూపర్ 6 పథకాలపై ప్రజల్లో ఆదరణ వస్తోందని, వీటి వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే ప్రతి పేదవాడికి ఈ ఆరు పథకాలు వర్తించి, వారి జీవన స్థితిగతులు మెరుగుపడతాయన్నారు. జిల్లా తెలుగు మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి. రాధాకృష్ణ, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు పడమటి వాసు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు అబ్దుల్ బాబా తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి మండలం పులపర్రులో టీడీపీ మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, ముళ్లపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సూపర్ 6 పథకాల క్యాలెండర్‌ను ఇంటింటికి పంపిణీ చేశారు. ముదినేపల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వీరమల్లు నరసింహారావు, వీరాబత్తిన సుధ, నియోజకవర్గ టీడీపీ టీడీపీ సెల్ ఉపాధ్యాక్షుడు మారగాని మురళీకృష్ణ, గ్రామ అధ్యక్షుడు జయమంగళ నాగేశ్వరరావు, కాట్రగడ్డ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

వైవీఎన్నార్ విద్యార్థినుల ప్రతిభ

కైకలూరు, మార్చి 1: కృష్ణా వర్సిటీ ఇంటర్ కాలేజియేట్ ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రఘునాథ్ రెడ్డి తెలిపారు. గత నెల 28న నందిగామలో పోటీలు నిర్వహించగా జి. స్రవంతి, ఎన్. లహరి ద్వితీయ స్థానం సాధించడంతో పాటు కృష్ణా వర్సిటీ స్థాయి జట్టులోకి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ ఉదయప్రకాష్, ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్ కె. జాలబాబు, అధ్యాపకులు డాక్టర్ ఎం. హరిప్రసాద్, నున్న శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ మన్నె శివనాగరాజు విద్యార్థినులను అభినందించారు.


ట్రాఫిక్ ట్రాలీలను పంపిణీ చేస్తున్న మానవత

ట్రాఫిక్ బోర్డుల వితరణ

కలిదిండి, మార్చి 1 : కలిదిండిలో ట్రాఫిక్ నియంత్రణ నిమిత్తం మానవత సేవా సంస్థ వారు కలిదిండి పోలీస్ స్టేషన్‌కు శుక్రవారం నాలుగు ట్రాఫిక్ బోర్డులు (ట్రాలీల)ను అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గోదావరి సత్యనారాయణ, ఛైర్మన్ పేటేటి వివేకానంద, డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌ఐ ప్రియకుమార్, సంస్థ సభ్యులు చక్కా జగన్, చిట్టూరి బాలకృష్ణ, కోకా శ్రీనివాస్, మావులూరి బాబురావు తదితరులు పాల్గొన్నారు.


ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

రహదారి భద్రతా నిబంధనలు పాటించండి

నూజివీడు టౌన్, మార్చి 1: రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేలా ఆటో యూనియన్ నాయకులు చర్యలు తీసుకోవాలని నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య అన్నారు. నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆటో యూనియన్ సభ్యులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించినా, నిబంధనలు అతిక్రమించి ప్రవర్తించినా వాహన చోదకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా యూనియన్‌లోని ప్రతి వాహనానికి ఒక నిర్దిష్ట క్రమసంఖ్యను ఇవ్వడం జరుగుతుందని, ప్రతి ఆటో డ్రైవర్ విధిగా తమ వివరాలతో కూడిన సమాచారాన్ని సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు అందించాలని ఆయన సూచించారు. నూజివీడు పట్టణ సీఐ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందించండి


ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న డీఎల్‌పీవో చంద్రకుమార్

ముదినేపల్లి, మార్చి 1 : అర్హులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏలూరు డీఎల్‌పీవో చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ముదినేపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ, ఈకేవైసీ, ఫొటో మిస్సింగ్ తదితర విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.రమణబాబు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు జి.రమేష్, కె.శ్రీనివాస్, షహనాజ్ బేగం, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న కార్మికులు

సంక్షేమ బోర్డును పటిష్ఠం చేయాలి

నూజివీడు, మార్చి 1: భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును పటిష్ఠం చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ ఏపీ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఎం.నాగరాజు డిమాండ్ చేశారు. ఎమ్మార్ అప్పారావు కాలనీలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పటిష్ఠం చేయాలని కోరుతూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసేందుకు చూస్తున్నాయన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న నిర్మాణ కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ లాంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు పి.రమేష్, ఎం.సీతారామయ్య, సురేష్, సన్ని తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలను పెంచండి

ముసునూరు, మార్చి 1: ఉపాధి కూలీల శాతాన్ని పెంచి, పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో సీహెచ్.పద్మావతీ దేవి ఆదేశించారు. శుక్రవారం ముసునూరు, చింతలవల్లి గ్రామాల్లో ఉపాధి పనులను ఆమె తనిఖీ చేశారు. కూలీల మస్తర్ల రికార్డును పరిశీలించారు. నిబంధనల ప్రకారం పనులు చేయాలని, కూలీల వేతనాలకు సంబంధించిన ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని, కూలీలు ఎక్కువ మంది పనులకు వచ్చేలా చర్యలు తీసుకుని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఏపీవో రోజ్ లీల, ఈసీ జయప్రసాద్, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

బాలరావమ్మకు వెండి కిరీటం



ఆగిరిపల్లి, మార్చి 1: ఆగిరిపల్లి మండలం శోభనాపురం గ్రామానికి చెందిన నల్లూరు బాబూరావు ఆగిరిపల్లిలో వేంచేసియున్న శ్రీ దుగ్గిరాల బాలరావమ్మకు 150 గ్రాముల వెండి కిరీటం బహూకరించారు. దాత కుటుంబీకులు కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారికి కిరీటాన్ని అందజేసినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వేద పాఠశాలను సందర్శించిన ఉపాధ్యక్షుడు



ఆగిరిపల్లి, మార్చి 1: ఆగిరిపల్లి లక్ష్మీ నరసింహ వేద పాఠశాలను పాఠశాల ఉపాధ్యక్షుడు పేర్వాల రఘు గురువారం సందర్శించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ డీజీగా పనిచేసి రిటైరైన ఆయన పాఠశాల అభివృద్ధికి ఎంతో దోహదపడ్డారు. గతంలో ఈయన పాఠశాలకు గౌరవ సలహాదారుగా ఉన్నారు. వేద పాఠశాల అభివృద్ధికి పాటుపడిన రఘుకు కార్యదర్శి శర్మ కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయండి


కరపత్రాలను అందజేస్తున్న బక్కయ్య

ముసునూరు, మార్చి 1: మిడ్డే మీల్స్, శానిటేషన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా మహాసభను విజయవంతం ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని గోపవరం, వేల్పుచర్ల, కాట్రేనిపాడు తదితర గ్రామాల్లో మహాసభ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బక్కయ్య మాట్లాడుతూ ఈ నెల 9న నూజివీడులోని అమర్‌భవన్‌లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు జిల్లా మహాసభ జరుగుతుందని, మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాల కార్మికులంతా పాల్గొనాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రమాద బీమా రూ.50 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు పాముల దేవమాత, భవాని, అబ్బూరి శకుంతల, దండిబోయిన వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని వీడను : ముద్దరబోయిన

నూజివీడు, మార్చి 1: టిక్కెట్ రానంత మాత్రాన నూజివీడు నియోజకవర్గాన్ని వదిలివెళ్ళే ప్రసక్తేలేదని, కార్యకర్తలకు అండగా నిలుస్తూ ఇక్కడే రాజకీయాల్లో కొనసాగుతానని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. నూజివీడు మండలం అన్నవరం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ గతంలో తాను ఓటమి పాలైనా నియోజకవర్గాన్ని వదలకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి ఇక్కడే ఉండి కృషి చేశానన్నారు. నూజివీడు మాజీ వైస్ ఎంపీపీ తాళం వెంకటేశ్వరరావు, ఆగిరిపల్లి నాయకులు బడుగు సోమయ్య, టీడీపీ యనమదల అధ్యక్షుడు చిమటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇండియన్ బ్యాంక్ మేనేజర్ దుర్గారావు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి

మండవల్లి, మార్చి 1: విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ బొంతు దుర్గారావు పేర్కొన్నారు. లోకుమూడిలోని వికాస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పొదుపు చేయాలని, పొదుపు చేసిన సొమ్ము కష్టకాలంలో ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బ్యాంకుల్లో డిజిటల్ లావాదేవీల విధానాన్ని వివరించారు. వికాస్ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ జి. రాజశ్రీ, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ పి. రాధ, దుర్గాప్రసాద్, సీహెచ్ వెంకట కల్యాణి, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి పెన్షన్ మంజూరు



ముదినేపల్లి, మార్చి 1 : పేరూరులో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించు కుంటున్న వీర్ల వెంకటరత్నంకు రూ.10 వేలు పెన్షన్ మంజూరైంది. సమస్యను ఇటీవల ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా, ఈ నెల నుంచే పెన్షన్‌ను మంజూరు చేయించారు. శుక్రవారం పెన్షన్‌ను ఎంపీపీ సత్యనారాయణ అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కొల్లేటికోటలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ


చాట్రాయి పీహెచ్‌సీలో శిక్షణ

పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలి

కైకలూరు, మార్చి 1: పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం అందరూ కృషి చేయాలని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. శుక్రవారం కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశంలో పీహెచ్‌సీ ద్వారా చేపట్టవలసిన అభివృద్ధి పనులు, మందులు, వైద్య పరికరాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 3న దేశవ్యాప్తంగా చేపట్టే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైద్య సిబ్బంది తమకు సూచించిన ప్రదేశాల్లో ఆయా ప్రాంతాల్లోని ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలను అందించాలన్నారు. గ్రామంలో పల్స్‌పోలియోపై అవగా హన ర్యాలీ నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఎండీ జహీర్, వైద్యాధికారి బి శంకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై సిబ్బందికి శిక్షణ

చాట్రాయి: చాట్రాయి పీహెచ్‌సీలో శుక్రవారం పల్స్ పోలియో విధులు నిర్వహించే సిబ్బందికి వైద్యాధికారులు శ్రీనివాసుల రెడ్డి, దుర్గాప్రసాద్ శిక్షణ ఇచ్చారు. పీహెచ్‌సీ పరిధిలో 32 పల్స్‌పోలియో కేంద్రాల్లో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు సమర్థవంతంగా పనిచేసి నూరు శాతం ఫలితాలు సాధించాలని కోరారు. సీహెచ్‌వో రమణ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: ప్రతి చిన్నారికి పోలియో చుక్కలను అందించటం ద్వారా పోలియోను శాశ్వతంగా దూరం చేయవచ్చని నూజివీడు మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట రామిరెడ్డి అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని నూజివీడు మున్సిపల్ పరిధిలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి రెండుసార్లు చిన్నారులకు పోలియో చుక్కలు ఇవ్వడం ద్వారా పోలియోను రాకుండా అరికట్టవచ్చన్నారు. ఐదేళ్లలోపు వయసున్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలను ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


నూజివీడు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం